



జలయోగాంధ్ర కార్యక్రమం తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదైనట్లు కలెక్టర్ బాలాజీ, ఎమ్మెల్యే మండలికి ధ్రువీకరణ పత్రం అందిస్తున్న సంస్థ ఫౌండర్ వెంకటాచారి, చిత్రంలో జేసీ గీతాంజలి శర్మ, ఎస్పీ గంగాధరరావు



శ్రీరామపాదక్షేత్రంలో పుష్పాసనం వేస్తున్న అభ్యాసకులు

జలాసనం

శ్రీరామపాదక్షేత్రంలో ఘనంగా జలయోగాంధ్ర

- ఆకట్టుకున్న జలయోగాసనాలు
- ఉత్సాహంగా పాల్గొన్న 150 మంది అభ్యాసకులు
- తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం

నాగాయలంక, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): సంధ్య సమయంలో చుట్టూ వివిధ వర్ణాల తెరచాప పడవల నడుమ కృష్ణానదిలో వందలాది మంది ప్రదర్శించిన వినూత్న జల యోగాసనాలతో శ్రీరామపాదక్షేత్రం పులకించింది. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర వేడుకల్లో భాగంగా బుధవారం నాగాయలంకలోని కృష్ణానదీ తీరంలో జలయోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. నాగాయలంక, విజయవాడ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన 150 మంది చిన్నారులు, పెద్దలు నీటిలో శవ, పద్మ, వృక్ష, వాయు దిగ్బంధనం వంటి యోగాసనాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ముఖ్యఅతిథులుగా అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, కలెక్టర్ డి.కె.బాలాజీ, ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు, జేసీ గీతాంజలి శర్మ, ఆర్డీవో కె.స్వాతి, డీఆర్వో కె.చంద్రశేఖర్‌రావు, డిప్యూటీ కలెక్టర్లు పోతురాజు, కె.సాయిబాబు హాజరై జల యోగాసనాలను వీక్షించారు. ఈ కార్యక్రమాన్ని మిగతా 6లో..





శవాసనాలు వేస్తున్న ఔత్సాహికులు

నాసిరకం!

రైతు బజారుల్లో నాణ్యతలేని కూరగాయలు

వడిలిపోయిన ఆకుకూరలు, పుచ్చిన దుంపలు

6

- అపరిశుభ్ర వాతావరణంలో విక్రయాలు
- పేరు రైతులది.. పెత్తనం దళారులది!
- అమలుకు నోచుకోని పట్టికలోని ధరలు
- కొందరి చేతుల్లో రైతు బజారుల నిర్వహణ
- పట్టనట్టు ఉంటున్న ఎస్టేట్ అధికారులు
- 'ఆంధ్రజ్యోతి' పరిశీలనలో అనేక విషయాలు వెలుగులోకి..



గుడివాడ రైతు బజార్‌లో నిలిచిన వర్షపు నీరు

రైతులకు గిట్టుబాటు ధర, వినియోగదారుడికి నాణ్యమైన కూరగాయలు లభిస్తాయనే లక్ష్యంతో జిల్లాలో ఏర్పాటు చేసిన రైతు బజారులు అధ్వానంగా తయారయ్యాయి. అపరిశుభ్ర వాతావరణంలో నాసిరకం కూరగాయల విక్రయ కేంద్రాలుగా మారాయి. రైతుల కంటే దళారులదే హవా నడుస్తోంది. విజయవాడ మార్కెట్ కంటే రూపాయి ఎక్కువే వసూలు చేస్తున్నారు. రైతుల ముసుగులోని కొందరు వ్యాపారుల చేతుల్లోనే రైతు బజారుల నిర్వహణ సాగుతోంది. పర్యవేక్షించాల్సిన ఎస్టేట్ అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలోని రైతు బజారుల దుస్థితిపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

(ఆంధ్రజ్యోతి బృందం): మచిలీపట్నంలో రెండు, ఉయ్యూరు, చల్లపల్లి, పెడన, కూచిపూడి, పామర్రు, గన్నవరం, కంకిపాడు, గుడివాడలో ఒకటి చొప్పున రైతు బజార్లు ఉన్నాయి. తెల్లవారుజాము ఐదు గంటల నుంచే కూరగాయల విక్రయాలు ప్రారంభమవుతాయి. ఎస్టేట్ అధికారులు వచ్చేలోగానే రైతుల ముసుగులో ఉన్న దళారులు కూరగాయల ధరలు నిర్ణయించేసి విక్రయాలు జరిపేస్తారు. ధరల పట్టికలో ఉదయం ఏడు, ఎనిమిది గంటలకు ధరలను నిర్ణయించి బోర్డులపై రాసే సమయానికి సగం వ్యాపారం పూర్తవుతుంది. అపరిశుభ్ర వాతావరణంలో ఉన్న రైతుబజార్లలో అనారోగ్యాన్ని కొనుగోలు చేయాల్సి వస్తోందని వినియోగదారులు వాపోతున్నారు. అధికారులు స్పందించి నాణ్యమైన కూరగాయలను విక్రయించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నాణ్యమైన కూరగాయలు విజయవాడకు తరలింపు

జిల్లాలో మోపిదేవి, అవనిగడ్డ, చల్లపల్లి, ఘంటసాల, తోట్లవల్లూరు, కంకిపాడు, ఉయ్యూరు, పెనమలూరు తదితర మండలాల్లో కూరగాయల తోటలు 15 వేల ఎకరాల్లో సాగవుతున్నాయి. రిలయన్స్ మార్ట్ తదితర కార్పొరేట్ స్థాయి వ్యాపార సంస్థలు వాహనాలతో సహా వచ్చి కూరగాయాలను తోటల వద్దనే కొనుగోలు చేస్తారు. తోటల వద్ద ట్రేలలో ప్యాక్ చేసిన కూరగాయలను మార్కెట్ ధర కంటే కిలోకు రెండు, మూడు రూపాయలు అధికంగా ఇచ్చి కొంటున్నారు. దీంతో నాణ్యమైన కూరగాయలను బడా సంస్థలకు విక్రయించి, నాసిరకం కూరగాయలను రైతు బజార్లకు తరలించి విక్రయాలు జరుపుతున్నారు. దీంతో వారంలో ఒకటీ రెండు రోజులు మాత్రమే, అది కూడా ఉదయం 7 గంటలలోపే కాస్త నాణ్యమైన కూరగాయలు అందుబాటులో ఉంటున్నాయి. ఇక మిగిలినవన్నీ నాసిరకం కూరగాయలే ఉంటున్నాయి.

- ఉయ్యూరు రైతు బజారులో 45 షాపులు ఉన్నాయి. స్థానికంగా మార్కెట్‌లో కూరగాయలు పాట కొట్ల నుంచి కొనుగోలు చేసి రైతు బజారుకు కూరగాయలను తెస్తారు. 45 మందిలో 35 మంది వ్యాపారులే ఉంటారు. రైతు బజారు వద్దనే చెత్తాచెదారం వేస్తుండటంతో దుర్వాసన వెదజల్లుతోంది. ధరల పట్టిక కనపడకుండా అరటి గెలలను అడ్డుగా కడుతున్నారు.

- పెడనలో 30 దుకాణాలున్నాయి. వాటిలో ఐదారు దుకాణాలు ఖాళీగానే ఉంటాయి. కొంత మేర నాణ్యమైన కూరగాయలనే విక్రయిస్తారు. పెడన మార్కెట్ యార్డు పక్కన ఉన్న రైతు బజారులో ధరలు బహిరంగ మార్కెట్‌లో కన్నా తక్కువగానే విక్రయిస్తున్నారు.

- చల్లపల్లి రైతు బజారు ఆవరణ పల్లంగా ఉండటంతో వర్షం కురిస్తే నీరు నిలిచిపోతోంది. దుకాణాల పైకప్పు రేకులు పగిలిపోయాయి. ఫ్లోరింగ్ పనులు చేపట్టాల్సి ఉంది. పల్లపు ప్రాంతంలో మెరక పోసి లెవలింగ్ చేయనున్నట్లు రైతు బజారు ఈవో చంద్రమోహన్ తెలిపారు. రైతు బజారులో మొత్తం 55 షాపులు ఉన్నాయి. రైతులతోపాటు వ్యాపారులు సైతం దుకాణాల్లో కూరగాయలు విక్రయిస్తున్నారు. అలాగే పామర్రు రైతు బజారులో 35 దుకాణాలు ఉన్నాయి. ఇందులో 19 షాపుల్లో రైతులు కూరగాయలు విక్రయిస్తుండగా, 16 దుకాణాలు డ్వాక్రా మహిళలు నడుపుతున్నారు. ఆరు దుకాణాలు ఖాళీగా ఉన్నాయి. గన్నవరం రైతు బజార్‌లో 67 దుకాణాలు ఉన్నాయి. వాటిల్లో రోజువారీ మార్కెట్ ధరలపట్టికకు అనుకూలంగా విక్రయాలు చేస్తున్నారు.

వర్షం వస్తే చిత్తడే

మచిలీపట్నం రైతు బజారులో 110 దుకాణాలు ఉన్నాయి. వీటిలో డ్వాక్రా సంఘాలకు 20 కేటాయించారు. మరో 10 వివిధ సొసైటీలకు చెందినవి. ఇక్కడ అపరిశుభ్ర వాతావరణంలోనే కూరగాయల విక్రయాలు చేస్తున్నారు. వర్షం వస్తే చిత్తడిగా మారుతోంది. మోపిదేవి మండలం నుంచి కూరగాయలు, మచిలీపట్నం మండలం నుంచి ఆకు కూరలు తెచ్చి విక్రయిస్తున్నారు. కూరగాయలు అన్నీ రెండో రకానికి చెందినవే. ఉల్లిపాయలు, అల్లం, వెల్లుల్లి కూడా నాసిరకమే మిగతా 6లో..

మచిలీపట్నంలోని బీసీ సంక్షేమ శాఖ కార్యాలయం



సిబ్బంది లేక ఇబ్బంది

ఉమ్మడి కృష్ణా బీసీ సంక్షేమ శాఖాధికారి నిర్వాకం

- హాస్టల్ వర్కర్లు అధికారుల ఇళ్లలో పనులకు కేటాయింపు
- సిబ్బంది లేక ఇంకా తెరుచుకోలేని హాస్టళ్లు ఎన్నో..
- కొన్ని మూతపడే పరిస్థితికి వచ్చినా మారని తీరు
- ఇళ్లకు వెళ్లిపోతున్న చాలామంది విద్యార్థులు


ఉమ్మడి కృష్ణాజిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి రూటే సెపరేటుగా ఉంది. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి వార్తల్లో నిలిచిన ఆయన తాజాగా హాస్టల్ వర్కర్లను అధికారుల ఇళ్లలో ఊడిగం చేయిస్తూ వివాదాస్పదమయ్యారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉమ్మడి కృష్ణాజిల్లా బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి మరోసారి వివాదంలో చిక్కుకున్నారు. ఇటీవల జరిగిన ఉద్యోగుల సాధారణ బదిలీల్లో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి అనేక ఆరోపణలు ఎదుర్కొన్నారు. అడ్డగోలుగా చేపట్టిన బదిలీలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందినా ఆయన వెనక్కి తగ్గలేదు. తాజాగా హాస్టళ్లలో పనిచేయాల్సిన అవుట్‌సోర్సింగ్ వర్కర్ల విషయంలో ఈ అధికారి వ్యవహరిస్తున్న తీరుపై మిగతా 6లో..

వీరు మారరంతే..!

డ్రైనేజీశాఖలో అధికారుల తీరుపై విమర్శలు

- వైసీపీ కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపునకు రంగం సిద్ధం
- టీడీపీ కాంట్రాక్టర్‌లకు మొండి చెయ్యి
- సీరియల్ ప్రకారం బిల్లుల చెల్లింపుల్లేవ్
- హైకోర్టు తీర్పును లెక్క చేయని అధికారులు



రాష్ట్రంలో ప్రభుత్వం మారి ఏడాది గడిచినా అధికారుల్లో మార్పు మాత్రం రావడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికీ వైసీపీ అనుకూల కాంట్రాక్టర్లకు పెద్ద పీట వేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఇందుకు డ్రైనేజీ విభాగంలో బిల్లుల చెల్లింపు ప్రక్రియ అద్దం పడుతోంది.

ఆంధ్రజ్యోతి - గుడివాడ : గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో డ్రైనేజీ శాఖ ఆధ్వర్యంలో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు చేపట్టారు. వీటిలో సింహభాగం పనులను వైసీపీ అనుకూల కాంట్రాక్టర్లు దక్కించుకున్నారు. టీడీపీ అనుకూల కాంట్రాక్టర్లు ఒకరిద్దరు మాత్రం ఆన్‌లైన్ ద్వారా కాంట్రాక్టులు పొందారు. గత పాలకులు కావాలనే కాంట్రాక్టు బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు హైకోర్టును ఆశ్రయించారు. కాంట్రాక్టర్లకు సీసీ పిటీషన్‌ల ప్రకారం సీరియల్ వారీగా నగదు చెల్లించాలని హైకోర్టు తీర్పునిచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బిల్లుల చెల్లింపు ప్రక్రియ వేగవంతం చేశారు. ఈ క్రమంలో 2025 మేలో సీఎంఎఫ్ఎస్ ద్వారా అప్లోడ్ చేయాలని డ్రైనేజీ శాఖ ఉన్నతాధికారులు మిగతా 6లో..

అట్టహాసంగా..

డీసీఎంఎస్ చైర్మన్‌గా బండి రామకృష్ణ బాధ్యతల స్వీకరణ

- రైతులకు అండదండలుగా కూటమి ప్రభుత్వం
- మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నంలోని సత్య కన్వెన్షన్ హాలులో డీసీఎంఎస్ చైర్మన్‌గా బండి రామకృష్ణ బాధ్యతల స్వీకరణ కార్యక్రమం బుధవారం రాత్రి అట్టహాసంగా జరిగింది. మూడు స్తంభాల సెంటర్ నుంచి సభా వేదిక వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ రైతులకు అండదండలుగా ఉండేలా కృష్ణాజిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీని నూతన అధ్యక్షుడు బండి రామకృష్ణ తీర్చిదిద్దుతారని తెలిపారు. ఎంపీ వల్లభనేని బాలశౌరి, తన గెలుపునకు కృషి చేశారని కొనియాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సారథ్యంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ ఒక హోటల్ కార్మికుడిగా జీవితం ప్రారంభించిన రామకృష్ణ హోటల్, విద్య, రాజకీయ రంగంలో రాణించారన్నారు. ఎమ్మెల్యేలు మండలి బుద్ధప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావు, జనసేన ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ మట్టా ప్రసాద్, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, మార్కెట్ యార్డు చైర్మన్ కుంచే నాని, టీడీపీ నాయకులు కొనకళ్ల బుల్లయ్య, తలారి సోమశేఖర్, జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు, డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ ప్రసాద్ పాల్గొన్నారు.



డీసీఎంఎస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న బండి రామకృష్ణ, చిత్రంలో మంత్రి రవీంద్ర, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, ఆర్టీసీ చైర్మన్ నారాయణ, జనసేన నేత ఉదయభాను తదితరులు



హంసలదీవికి వెళ్లే ప్రధాన రహదారి దుస్థితి

సంగమ ప్రాంతాలపై నిర్లక్ష్యపు నీడ

- అభివృద్ధికి దూరంగా పవిత్ర సంగమం, సాగర సంగమం
- మౌలిక సదుపాయాలు లేక పర్యాటకుల అవస్థలు
- కనీస వసతులు కల్పించకుండా హంసలదీవిలో టోల్ వసూళ్లా..!
- రివర్ ఫ్రంట్, బీచ్ టూరిజం ప్రాంతాలుగా అభివృద్ధి చేయాలి

8

పార్ట్‌టైమ్ ఉద్యోగం పేరుతో మోసం

- యువతికి రూ.27 లక్షలు టోకరా

పీఏసీఎస్‌లలో పారదర్శక సేవలు

- ఉమ్మడి జిల్లాలోని 213 పీఏసీఎస్‌లలో కంప్యూటరీకరణ పూర్తి
- కేడీసీసీబీ చైర్మన్ నెట్టెం రఘురాం

6



కంచికచర్లలో డ్రోన్ పనితీరును పరిశీలిస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ, ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య

వ్యవసాయాన్ని లాభసాటిగా మారుద్దాం

- సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోండి
- సబ్సిడీపై వ్యవసాయ పరికరాల పంపిణీ కార్యక్రమంలో రైతులకు కలెక్టర్ లక్ష్మీశ పిలుపు

కంచికచర్ల రూరల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): 'ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రైతుల అభ్యున్నతికి తోడ్పాటును అందిస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ సాగు ఖర్చులు తగ్గించుకోండి. ప్రతికూల పరిస్థితులను అనుకూలంగా మార్చుకుని వ్యవసాయాన్ని లాభసాటిగా మారుద్దాం.' అని రైతులకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. కంచికచర్ల రైతుసేవా కేంద్రం వద్ద బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలను ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్యతో కలిసి ఆయన అందించారు. జిల్లాలో 867 మంది చిన్న సన్నకారు రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలకు రూ.1.67 కోట్ల చెక్కులను అందించారు. వైవిధ్య పంటలు సాగు చేసుకోవాలని రైతులకు సూచించారు. జిల్లా వ్యవసాయాధికారిణి ఎం.విజయకుమారి, కోగంటి బాబు, తహసీల్దార్ మానస, ఎంపీడీవో లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

రైతు ప్రభుత్వమిది: తంగిరాల సౌమ్య

'వ్యవసాయ యాంత్రీకరణకు సబ్సిడీపై పరికరాలు అందించడం ద్వారా కూటమి ప్రభుత్వం రైతు ప్రభుత్వమని మరో మారు రుజువైంది. వైసీపీ ఐదేళ్ల పాలనలో సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు అందించలేదన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఈనెల చివరికి అన్నదాత సుఖీభవ పథకం కింద రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతుంది. అని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య అన్నారు.



కృష్ణా కలెక్టరేట్‌లో డ్రోన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలిశర్మ

యాంత్రీకరణను అలవరచుకోండి

- రైతులకు కలెక్టర్ బాలాజీ సూచన

మచిలీపట్నం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని తక్కువ ఖర్చుతో వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించాలని రైతులకు కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సూచించారు. పురుగుమందుల పిచికారీకి ఉపయోగించే రెండు డ్రోన్లను 80శాతం రాయితీపై మోపిదేవి మండలానికి చెందిన ఇద్దరు రైతులకు కలెక్టరేట్‌లో బుధవారం జేసీ గీతాంజలి శర్మతో కలిసి ఆయన అందించారు. వరి, ఇతర పంటలకు తెగుళ్లు సోకినపుడు తక్కువ ఖర్చు, తక్కువ సమయంలో పురుగుమందుల పిచికారీకి ఈ డ్రోన్లు ఉపయోగపడతాయని కలెక్టర్ అన్నారు. జిల్లాలో 32 డ్రోన్లు సబ్సిడీపై ఇచ్చేందుకు అనుమతులు ఇచ్చామని, రైతులసంఘాల సభ్యులు 15మంది ముందుకు వచ్చి నగదు చెల్లించారని కలెక్టర్ తెలిపారు. ఒక్కో డ్రోన్ ఖరీదు రూ.9.80 లక్షలని ఇందులో రైతులవాటా 20శాతం, మిగిలిన 80శాతం ప్రభుత్వం సబ్సిడీగా ఇస్తోందని కలెక్టర్ తెలిపారు. డ్రోన్ల పనితీరును కలెక్టర్, జేసీ పరిశీలించారు. వ్యవసాయశాఖ జేడీ మనోహరరావు, ఏడీ మణిధర్, మోపిదేవి మండలం మెరకనపల్లికి చెందిన రైతు ప్రదీప్, కోసూరివారిపాలేనికి చెందిన రైతు వెంకటరమణ, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

మాజీ ప్రధానులకిచ్చే గౌరవం ఇదేనా?


- గన్నవరంలో నెహ్రూ, ఇందిర, రాజీవ్‌గాంధీల విగ్రహాల తొలగింపుపై ఏఐసీసీ సభ్యురాలు సుంకర పద్మశ్రీ ఆగ్రహం



తహసీల్దార్ కేవీ శివయ్యతో మాట్లాడుతున్న ఏఐసీసీ సభ్యురాలు సుంకర పద్మశ్రీ

గన్నవరం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): దేశానికి స్వాతంత్ర్యం తెచ్చి ఆస్తులను పోగొట్టుకుని ప్రాణత్యాగాలు చేసిన మాజీ ప్రధానులకు కూటమి ప్రభుత్వం ఇచ్చే గౌరవం ఇదేనా అని ఏఐసీసీ సభ్యురాలు సుంకర పద్మశ్రీ ధ్వజమెత్తారు. గన్నవరం అభివృద్ధిలో భాగంగా జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ, రాజీవ్‌గాంధీ విగ్రహాలను బుధవారం తొలగిస్తున్నారని సమాచారం అందుకున్న ఆమె అక్కడికి వచ్చి పరిశీలించారు. తహసీల్దార్ కేవీ శివయ్యతో మాట్లాడారు. తొలగించిన నెహ్రూ విగ్రహాన్ని పంచాయతీ కార్యాలయంలోని స్క్రాప్‌లో పడేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ప్రధానులకు ఇచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. నియోజకవర్గంలో ఏఐసీసీ సభ్యురాలుగా ఉన్న తనకు కనీస సమాచారం ఇవ్వకుండా తొలగించటం సరికాదన్నారు. నెహ్రూ విగ్రహాన్ని పాదాల వరకు నరికేసి స్క్రాప్‌లో పడేయటం దుర్మార్గమన్నారు. పంచాయతీలో తీర్మానాలు లేకుండా విగ్రహాలు ఎలా తొలగిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీలో తీర్మానం చేసి లిఖితపూర్వకంగా హామీ ఇస్తేనే విగ్రహాలు తొలగించేందుకు అనుమతిస్తామని లేకుంటే ఊరుకోబోమని పద్మశ్రీ హెచ్చరించారు.

దుర్గమ్మను దర్శించుకున్న ప్రముఖులు



కేంద్ర సాధికార కమిటీ సభ్యుడు చంద్రశేఖర్ గోయల్‌కు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న ఈవో శీనానాయక్, ఉపసభాపతి రఘురామకృష్ణంరాజు, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

ఇంద్రకీలాద్రి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కనకదుర్గమ్మను బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఈవో శీనానాయక్, అర్చకులు ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికి అమ్మవారి దర్శనానికి తోడ్కొని వెళ్లారు. వేదాశీర్వచన మండపంలో వేద పండితులు ఆశీస్సులు అందజేశారు. అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రాలను ఈవో అందించారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో కేంద్ర సాధికార కమిటీ సభ్యుడు చంద్రశేఖర్ గోయల్, జె.ఆర్. భట్, సునీల్ లిమాయే, శాసనసభ ఉపసభాపతి రఘురామకృష్ణంరాజు, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, అటవీ పర్యావరణశాఖ అధికారులు ఉన్నారు.

మిర్చి సాగుపై అనాసక్తి!

ఈ ఏడాది ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు, కౌలురైతుల మొగ్గు



ఎన్టీఆర్ జిల్లాలో మిర్చి రైతుల పరిస్థితి కడు దయనీయంగా ఉంది. గత సీజన్‌లో దిగుబడి తగ్గడం, మార్కెట్లో గిట్టుబాటు ధర రాకపోవటం వల్ల మిర్చి సాగు చేసిన రైతులందరూ అప్పుల ఊబిలో కూరుకుపోయారు. ఇంతకు ముందెన్నడూ లేనంతగా తీవ్రంగా నష్టపోయిన రైతులు, కౌలుదారులు మిర్చి సాగుపట్ల ఆసక్తి చూపడం లేదు. ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో జిల్లాలో మిర్చి సాగు విస్తీర్ణం సగానికి తగ్గనున్నది.

- గత సీజన్‌లో తోటలపై నల్లి దాడి
- తోటలు కకావికలమై తగ్గిన దిగుబడులు..
- గిట్టుబాటుధర రాక భారీ నష్టాలు
- అప్పుల ఊబిలో సాగుదారులు..
- సగానికి పడిపోయిన కౌలు ధరలు

(ఆంధ్రజ్యోతి, కంచికచర్ల): గత సీజన్‌లో జిల్లాలో 30 వేల ఎకరాల్లో రైతులు మిర్చి తోటలు సాగు చేశారు. పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల్లో ఎకరం రూ.30 వేల నుంచి రూ.40 వేలకు కౌలుకు తీసుకుని కౌలుదారులు కూడా ఎంతో ఆశతో మిర్చి వేశారు. కౌలు, వ్యవసాయం, ఎరువులు, పురుగుమందులు, నీటి తడులు ఇతరత్రా ఖర్చులు కలిపి ఎకరానికి రూ.1.80 లక్షల నుంచి రెండు లక్షల వరకు పెట్టుబడి అయ్యింది. కోత, గ్రేడింగ్, టిక్కీల తొక్కుడు, రవాణా కలిపి క్వింటాకు రూ.5 వేల నుంచి రూ.6 వేల వరకు ఖర్చు అయ్యింది. ఆగస్టు చివర్లో, సెప్టెంబరు మొదట్లో కురిసిన భారీ వర్షాలకు, వరదలకు మిర్చి తోటలు దెబ్బతిన్నాయి. ఖర్చుకు వెనుకాడకుండా రైతులు మళ్లీ తోటలు సాగుచేశారు. ఎర్ర నల్లి, నల్ల నల్లి ఉధృతంగా దాడి చేయడంతో రోజుల వ్యవధిలోనే తోటలు కకావికలమయ్యాయి. పూత రాలిపోయింది. ఆకులు, పిందెలు నల్లగా మాడిపోయాయి. చిగుళ్లు సైతం వాడిపోయాయి. మిరప మొక్కలు గిడసబారి, జీవచ్ఛవాల్లా మారాయి. వేరుకుళ్లు సోకినట్టుగా తోటలు ఎర్రబడి నిలువునా ఎండిపోయాయి. ఖరీదైన మందులు పిచికారీ చేసినప్పటికీ నల్లి అదుపులోకి రాలేదు. తోటల్లో దిగుబడులు గణనీయంగా తగ్గాయి. ముదురు తోటల్లో ఎకరానికి 20 క్వింటాళ్ల లోపు, లేత తోటల్లో పది క్వింటాళ్ల లోపు దిగుబడి వచ్చింది.

రైతును చావు దెబ్బ కొట్టిన ధరలు

మార్కెట్ ధర కూడా మిర్చి రైతులను చావు దెబ్బకొట్టింది. తేజ రకానికి క్వింటా రూ.ఎనిమిది వేల నుంచి రూ.13 వేల లోపే ధర వచ్చింది. లావు రకాలకు రూ.8 వేల నుంచి రూ.10 వేల లోపు, మధ్యస్థ రకాలకు రూ.పది వేల నుంచి రూ.11 వేల లోపు ధర వచ్చింది. ఇప్పటికీ మార్కెట్ కు దుటపడలేదు. ధరల్లో మార్పు రాలేదు. అంతకు ముందు సీజన్‌లో తాలు (తెల్ల)కాయలకు వచ్చిన ధర కూడా ఇప్పుడు ఎర్రకాయలకు రావటం లేదు. అప్పట్లో తెల్లకాయలకు వచ్చిన రూ.10 వేల నుంచి రూ.13 వేలే ఇప్పుడు ఎర్రకాయలకు పలికింది.

ఎకరాకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు నష్టం

మిర్చి సాగు చేసిన రైతుల్లో 90 శాతం మంది నష్టాలను మూటగట్టుకున్నారు. ఎకరానికి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు నష్టం వాటిల్లింది. 20 క్వింటాళ్ల దిగుబడి వచ్చిన రైతులకు కూడా మిగులు లేకపోగా నష్టపోయారంటే మిర్చి సాగు చేసిన రైతులు ఎంతగా కుదేలయ్యారో అర్థం చేసుకోవచ్చు. మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకం వల్ల కూడా రైతులకు ఎలాంటి ప్రయోజనం కలగలేదు. కొద్దోగొప్పో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సాయం అందుతుందని ఆశించిన రైతులు భంగపడ్డారు. ఇప్పటి వరకు ప్రభుత్వాల నుంచి ఒక్క పైసా కూడా రైతులకు సమకూరలేదు.

మొక్కజొన్న, సుబాబుల్, జామాయిల్ సాగువైపు మొగ్గు..

కోలుకోలేనంతగా నష్టపోయిన రైతులు, కౌలుదారులు మిర్చి అంటేనే భయపడుతున్నారు. ఆర్థికంగా బాగా చితికిపోయిన కౌలుదారులు అప్పుల్లో కూరుకుపోయారు. దీంతో పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల్లో కౌలు ధరలు సగానికి సగం పడిపోయాయి. మిర్చి తోటలకు కౌలుకు తీసుకునేందుకు కౌలుదారులు ఎవరూ ముందుకు రావటం లేదు. గత సీజన్‌లో రూ.40 వేలున్న కౌలు ఈ సీజన్‌లో రూ.20వేలకు, రూ.20వేలున్న కౌలు రూ.10 వేలకు పడిపోయింది. ఎక్కువ మంది రైతులు మొక్కజొన్న సాగుకు మొగ్గు చూపుతున్నారు. ఇంకొందరు సుబాబుల్, జామాయిల్ తోటలు వేస్తున్నారు. ఈ సీజన్‌లో మిర్చి సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గనున్నది.



దుర్గగుడి ఈవో శీనానాయక్‌కు లేఖ అందిస్తున్న భాగ్యనగర్ మహంకాళీ బోనాల జాతర కమిటీ ప్రతినిధులు

29న కనకదుర్గమ్మకు బంగారు బోనాలు

ఇంద్రకీలాద్రి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): సప్తమాతృకలకు సప్త బంగారు బోనం సమర్పణ పేరుతో ఈనెల 29వ తేదీన భాగ్యనగర్ మహంకాళీ బోనాల జాతర ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మకు బోనం, పట్టువస్త్రాలను సమర్పించనుంది. ఈమేరకు బుధవారం దుర్గామల్లేశ్వర దేవస్థానం ఈవో శీనానాయక్‌కు కమిటీ అధ్యక్షుడు గోపిశెట్టి రాఘవేందర్, ఎంపీ గౌడ్ తదితర ప్రతినిధులు లేఖ ఇచ్చారు. బంగారు బోనాల సమర్పణకు హైదరాబాద్ నుంచి సాంస్కృతిక బృందాలతో సహా 500 మంది భక్తులు ఈనెల 28న విజయవాడకు చేరుకుంటారని ఆయన తెలిపారు. 29వ తేదీన ఉదయం బ్రాహ్మణవీధిలోని జమ్మిదొడ్డి నుంచి బంగారు బోనాల ఊరేగింపు సాగుతుందని వివరించారు. వసతి, కనకదుర్గమ్మ దర్శనం, బోనం సమర్పణ, ప్రసాదాల పంపిణీకి ఏర్పాట్లు చేయాలని ఆయన కోరారు. బోనాల కమిటీ కోరిన అన్ని ఏర్పాట్లను లోటుపాట్లు లేకుండా చేయాలని అధికారులకు ఈవో సూచించారు.

పార్ట్‌టైమ్ ఉద్యోగం

పేరుతో మోసం

- యువతికి రూ.27 లక్షలు టోకరా

పెనమలూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): టెలిగ్రామ్ యాప్ ద్వారా పార్ట్‌టైమ్ ఉద్యోగంలో చేరిన యువతిని రూ.27లక్షలకు ముంచిన కేటుగాళ్లపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కానూరు గ్రామానికి చెందిన గోపు దివ్య పార్ట్‌టైమ్ ఉద్యోగాలున్నాయని ఆన్‌లైన్‌లో ఒక ప్రకటన చూసింది. మంగళవారం ప్రకటన ఇచ్చిన వారిని సంప్రదించింది. వారు తాము పార్టుటైమ్ ఉద్యోగాల రిక్రూట్‌మెంటు ఏజెన్సీ నిర్వాహకులుగా పరిచయం చేసుకొన్నారు. షేర్‌చాట్‌లో పోస్టులను లైక్ చేయడం ద్వారా డబ్బులు సంపాదించొచ్చని ప్రతి పోస్టుకు రూ.50 ఇస్తామని నమ్మబలికారు. ఆమెకు అనేక రకాల లింకులను పంపించడం మొదలుపెట్టారు. వారిని నమ్మిన ఆ యువతి వారు చెప్పినప్పుడల్లా డబ్బులు చెల్లించింది. ఎక్కువ మొత్తంలో చెల్లించి అధిక లాభం పొందండని చెప్పడంతో ఆమె పేరుతో ఉన్న ఖాతాలు, యూపీఐ ద్వారా రూ.27లక్షలను వారికి పంపింది. ఆమె ఖాతాలు ఖాళీ అయ్యాక కేటుగాళ్లు ఫోన్లు స్విచ్ ఆఫ్ చేశారు. తాను మోసపోయానని దివ్య 1930కు సైబర్ కంప్లయింట్ ఇచ్చి, పెనమలూరు పోలీసులకు సమాచారమిచ్చింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పీఏసీఎస్‌లలో పారదర్శక సేవలు

- ఉమ్మడి జిల్లాలోని 213 పీఏసీఎస్‌లలో కంప్యూటరీకరణ పూర్తి: కేడీసీసీబీ చైర్మన్ నెట్టెం రఘురాం



పీఏసీఎస్‌ల సిబ్బంది శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కేడీసీసీబీ చైర్మన్ నెట్టెం రఘురాం

మచిలీపట్నం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లా కేంద్ర సహకారబ్యాంకు(కేడీసీసీబీ) పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో(పీఏసీఎస్‌లు) రైతులకు సత్వర, పారదర్శకమైన సేవలు అందించాలని సిబ్బందిని కేడీసీసీబీ చైర్మన్ నెట్టెం రఘురాం ఆదేశించారు. పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణలో భాగంగా సిబ్బందికి శిక్షణ తరగతులను కేడీసీసీబీ ప్రధాన కార్యాలయంలో బుధవారం ఆయన ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాలోని 213 పీఏసీఎస్‌లలో కంప్యూటరీకరణ ప్రక్రియ పూర్తయిందన్నారు. ఇకనుంచి డిజిటల్ పద్ధతిలోనే పాలనా వ్యవహారాలు పీఏసీఎస్‌లలో నడపాల్సి ఉందన్నారు. ప్రస్తుతం మీసేవా కేంద్రాల ద్వారా భూములకు సంబంధించిన వన్‌బీ, అడంగల్‌పత్రాలు ఇస్తున్నారని, ఇకనుంచి పీఏసీఎస్‌ల ద్వారా అందించేలా చూస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుచూపుతో వ్యవహరిస్తున్నారని, సహకార వ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తున్నారని అన్నారు. పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణలో కేంద్ర ప్రభుత్వం 60శాతం, రాష్ట్ర ప్రభుత్వం 30శాతం, నాబార్డు 10శాతం ఖర్చును భరిస్తోందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో కేడీసీసీబీ సీఈవో శ్యామ్‌మనోహర్, జీఎం చంద్రశేఖర్, ఆప్కాబ్ ఏజీ ఎం అశోక్, కేడీసీసీబీ అధికారులు జి.పవన్ కుమార్, టి.జగదీష్‌బాబు, విజయసారథి పాల్గొన్నారు.

సిబ్బంది లేక ఇబ్బంది

(5వ పేజీ తరువాయి)

విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనల ప్రకారం ప్రతి హాస్టల్‌కు ముగ్గురు వర్కర్లు ఉండాలి. కానీ, ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లోని ఏ ఒక్క హాస్టల్‌లో కూడా ఆ పరిస్థితి లేదు. ఉమ్మడి కృష్ణాలో అంతర్భాగంగా ఉన్న ఒకప్పటి నూజివీడు సహా అన్ని డివిజన్లలోనూ ఇలాగే ఉంది. ప్రొటోకాల్ పేరుతో హాస్టల్ వర్కర్లను ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారుల ఇళ్లలో పనిచేయించడమే ఇందుకు కారణం. చాలామంది హాస్టల్ వర్కర్లు అధికారుల ఇళ్లలో వంట మనుషులుగా, కారు డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. ఈ వ్యవహారంలో జిల్లా అధికారి వ్యక్తిగత ప్రయోజనాలు ఉన్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి.

హాస్టళ్లలో ముగ్గురు వర్కర్లు ఉండాల్సిందే..

నిబంధనల ప్రకారం ప్రతి వసతి గృహానికి ముగ్గురు వర్కర్లు ఉండాలి. ఒకరు వంట చేయటానికి, మరొకరు విద్యార్థులను పర్యవేక్షించటానికి, మూడోవారు హాస్టల్‌ను పరిశుభ్రంగా ఉంచడం, వంటకు అవసరమైన కూరగాయలు కట్ చేయటానికి. కానీ, పిల్లలున్న హాస్టళ్లలో ఒకరు లేదా ఇద్దరు వర్కర్లే ఉంటున్నారు. వంట బాగా వచ్చిన వారిని అధికారుల ఇళ్లలో వంట పనులు చేసేందుకు పంపుతున్నారు. పనిచేయలేనివారు, దివ్యాంగులుగా ఉన్నవారు హాస్టళ్లలో ఉంటున్నారు.

విద్యార్థుల పాట్లు

అధికారుల నిర్లక్ష్యం కారణంగా వసతి గృహాల్లోని విద్యార్థులు నానా పాట్లు పడుతున్నారు. నిర్వహణలో కీలకమైన సిబ్బంది లేకపోవడంతో అసలు హాస్టళ్లే ప్రారంభించవద్దని ఉన్నతాధికారులే మౌఖిక ఆదేశాలు ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. విద్యాసంస్థలు తెరుచుకుని వారం అవుతున్నా.. ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో ప్రభుత్వ వసతి గృహాలు ప్రారంభం కాలేదు. తెరుచుకున్నవి కూడా వర్కర్ల సమస్య కారణంగా క్లాసులకు సన్నద్ధం కాలేదు. దీంతో విద్యార్థులు ఇళ్లకు వెళ్లిపోయే పరిస్థితి ఏర్పడింది. దీనికి తాము బాధ్యులం కాదంటూ అధికారులు, ఉన్నతాధికారులు ఏకంగా హాస్టళ్లను మూసివేసే పరిస్థితికి తీసుకొచ్చారు. దీంతో పిల్లల భవిష్యత్తు ఏమవుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పెనమలూరు, అవనిగడ్డ, బందరు, గుడివాడ, నూజివీడు, విజయవాడ, గన్నవరం, నందిగామ డివిజన్ల పరిధిలోని పలు హాస్టళ్లు సిబ్బంది కొరత కారణంగానే ఇప్పటికీ తెరుచుకోలేదు.

జలాసనం

(5వ పేజీ తరువాయి)

తెలుగు బుక్ ఆఫ్ రికార్డులో నమోదు చేసి కలెక్టర్ బాలాజీకి ఫౌండర్, చైర్మన్ చింతపట్ల వెంకటాచారి ధ్రువీకరణ పత్రం అందజేశారు. యోగాసనాల్లో పాల్గొన్న దివ్యాంగుడు తలశిల రాము, చిన్నారి పద్యాల నిత్యశ్రీ ప్రియలకు జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని కలెక్టర్ అందజేసి అభినందించారు.

యోగాసనాలతో సంపూర్ణ ఆరోగ్యం : కలెక్టర్

యోగాసనాలతో సంపూర్ణ ఆరోగ్యంగా లభిస్తుందని కలెక్టర్ బాలాజీ అన్నారు. యువత జలాసనాలు వేయటం ద్వారా జలక్రీడల్లో రాణించి ఉజ్వల భవిష్యత్ పొందవచ్చని తెలిపారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ ఆయుష్, ఆవారా సంస్థ, ఇతర శాఖల ఆధ్వర్యంలో వినూత్న రీతిలో జలాసనాలు చేయటం ఆనందంగా ఉందన్నారు.

నాసిరకం!

(5వ పేజీ తరువాయి)

తెస్తున్నారు. 50 దుకాణాలు రాజకీయ నాయకులు సిఫార్సు చేసిన వ్యాపారుల చేతుల్లోనే ఉన్నాయి. రైతు బజారు ఏర్పాటు చేసినప్పటి నుంచి ఒకరిద్దరు రైతుల రూపంలో ఉన్న దళారులు రైతు బజారును తమ చెప్పుచేతల్లో పెట్టుకుని వారే ధరలను నిర్ణయిస్తారు. ఎస్టేట్ అధికారి వచ్చేలోపుగానే సగం వ్యాపారం వీరి కనుసన్నల్లోనే నడుస్తోంది. జిల్లా కేంద్రంలో ఉన్నా అధికారులు ఎవ్వరూ ఈ వైపునకు కన్నెత్తి చూడటంలేదు. రాజుపేటలో మరో రైతు బజారు ఏర్పాటు చేసినా ఇక్కడ మూడు, నాలుగు దుకాణాలకు మించిలేవు.

విజయవాడ కంటే రూపాయి ఎక్కువే..

గుడివాడ రైతు బజారులో బయట ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకున్న కూరగాయలపై రవాణా చార్జీల పేరుతో విజయవాడ రైతు బజారు కన్నా కిలోకు రూపాయి ఎక్కువ ధరకు కూరగాయలను విక్రయిస్తున్నారు. స్థానికంగా పండించే కూరగాయలకు అదే ధర వసూలు చేస్తున్నారు. రైతు బజారులో మొత్తం 76 షాపులు ఉండగా, ఏడు కిరాణా వ్యాపారం, 33 అద్దె ప్రాతిపదికన (దివ్యాంగులకు 12 కలిపి), మరో 36 రైతులకు కేటాయించారు. ఒక్కో షాపును ఇద్దరు రైతులకు చొప్పున కేటాయిస్తారు. ఇక్కడ 72 మంది రైతులకు అవకాశం కల్పించారు. అయితే ఈ షాపులను నిర్వహించే వారిలో పదుల సంఖ్యలో బయటి వ్యాపారులే ఉన్నారు. ప్రస్తుతం షాపులు నిర్వహించే వారిలో కొందరు రైతులు కాకున్నా.. తహసీల్దార్ల ద్వారా ధ్రువీకరణ పత్రాలను పొందినవారే ఉండటం గమనార్హం.

కొన్ని షాపుల్లో మిగిలిన చిల్లరను ఇవ్వడంలేదు. కొందరు రైతులు షైనస్థాళ్లలో కాకుండా ఎదురుగా కిందపెట్టి అమ్మకాలు చేస్తున్నారు, దీంతో వినియోగదారుల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వర్షం వస్తే విక్రయదారులు, వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రైతుబజారు ఆవరణలో అడుగు మేర నీరు నిలిచిపోతుంది.

ఉపరాష్ట్రపతి, కేంద్ర మంత్రులను కలిసిన

మంత్రి లోకేశ్, ఎంపీ కేశినేని చిన్ని

వన్‌టౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్‌తో కలిసి ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) బుధవారం ఢిల్లీలో ఉపరాష్ట్రపతి జగదీప్ ధనకర్, పలువురు కేంద్ర మంత్రులను కలిశారు. మంత్రి నారా లోకేశ్‌తో కలిసి మంత్రులతో జరిగిన చర్చల్లో ఆయన పాల్గొన్నారు. కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి చిరాగ్ పాశ్వన్, విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్, ఇంకా పలువురు మంత్రులను లోకేశ్‌తో పాటు చిన్ని కలిశారు.

జగన్‌కు పొలిటీషియన్ లక్షణాల్లేవు

- కులాల కుంపట్లు రాజేయడమే ఆయన నైజం: మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ

వన్‌టౌన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్‌కు పొలిటీషియన్ లక్షణాలు లేవని, కులాల కుంపట్లు రాజేయటమే ఆయన నైజమని మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ విమర్శించారు. బుధవారం మొగల్రాజపురం సిద్ధార్థనగర్‌లోని ఓ హోటల్‌లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పోలీస్ వ్యవస్థను అందరూ గౌరవిస్తారని, మాజీ ముఖ్యమంత్రిగా జగన్‌కు ఒక రూల్, సాధారణ వ్యక్తులకు మరో రూల్ ఉండవని ఆమె స్పష్టంచేశారు. పల్నాడు పర్యటనకు పోలీసుల అనుమతి ఇవ్వకపోతే కోర్టుకెళ్లి అనుమతి తీసుకోవాలి, కానీ బలప్రదర్శన చేసేలా జగన్ పర్యటన సాగిందన్నారు.పాదయాత్రలో లోకేశ్, పర్యటనల్లో పవన్ కల్యాణ్ పోలీసులు అనుమతి ఇవ్వకపోతే రూల్ ప్రకారమే నడుచుకున్నారని ఆమె తెలిపారు. పల్నాడు పర్యటనలో పోలీసులను అసభ్యకరంగా దూషించటం, రాళ్లు రువ్వటం ఏమిటి అని ప్రశ్నించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు లేకుండా చేయాలని జగన్ చూస్తున్నారన్నారు. జగన్‌ను చూసి నేరస్థులు పేట్రేగిపోతారన్నారు. పల్నాడు పర్యటనలో కాన్వాయ్ ఢీకొని ఒకరు, తొక్కిసలాటలో మరొకరు గుండెపోటుతో చనిపోయారని వారికి జగన్ సంతాపం తెలిపారా..అని వాసిరెడ్డి పద్మ ప్రశ్నించారు. ఎన్నికల్లో వైసీపీ గెలుస్తుందని బెట్టింగ్‌లు కట్టి చనిపోయిన వారందరి కుటుంబాలను జగన్ పరామర్శించారా అని ఆమె నిలదీశారు. ఏడాది క్రితం చనిపోయిన వ్యక్తి కుటుంబాన్ని పరామర్శించడానికి జగన్‌కు ఇప్పటిదాకా సమయం దొరకలేదా? అని ఆమె ప్రశ్నించారు.

కమ్మ కులంలో పుట్టడమే తప్పా..

జగన్..కమ్మ సామాజికవర్గం వారిని వాడుకుని అందరూ ద్వేషించేలా చేస్తాడని వాసిరెడ్డి పద్మ అన్నారు. తనకు జగన్ చేసిన ద్రోహం ఎప్పటికీ మరిచిపోనన్నారు. తాను కమ్మకులంలో పుట్టటమే తప్పా అని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను ఎన్నో అవమానాలకు గురిచేశాడని తెలిపారు. రాష్ట్రంలో గొడవలు చేయాలని జగన్ చూస్తున్నాడని రాష్ట్ర ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఆమె కోరారు. పార్టీ నడపటంలోను, ప్రభుత్వం నడపటంలోనూ జగన్‌కు బాధ్యత లేదని, తాను రాజీనామా చేసిన సమయంలోనే ఈ విషయాలు చెప్పానని వాసిరెడ్డి పద్మ తెలిపారు.

వీరు మారరంతే..!

(5వ పేజీ తరువాయి)

ఆదేశాలిచ్చారు. హైకోర్టు ఆదేశాల మేరకు సీసీ పిటీషన్‌ల ప్రకారం సీరియల్ వారీగా అప్లోడ్ చేయాల్సి ఉంది. గుడివాడ డ్రైనేజీ ఓఅండ్ఎం వర్క్సుకు ఎల్‌వోసీకి సంబంధించి రూ.8.59 కోట్ల బిల్లులను అప్లోడ్ చేసినట్లు అధికారులు ధ్రువీకరించారు. డ్రైనేజీ అధికారులు మాత్రం ఇంకా వైసీపీ మత్తులోనే జోగుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. గత ప్రభుత్వంలో రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలకు అనుకూలంగా వ్యవహరించిన కాంట్రాక్టర్లకు పెద్ద పీట వేస్తూ బిల్లులను అప్లోడ్ చేశారు. సదరు బిల్లుల్లో టీడీపీ అనుకూల సీఎన్‌ఆర్ ప్రాజెక్టుకు చెందిన సుమారు రూ.45లక్షల బిల్లులను అప్లోడ్ చేయకపోవడం గమనార్హం. పనులు అప్పియరెన్స్, కంప్లెయింట్స్, అడ్మిషన్ స్టేజ్‌లో ఉన్న వాటిని కూడా అప్లోడ్ చేశారు. నూరు శాతం పనిపూర్తి చేసిన టీడీపీ కాంట్రాక్టర్ బిల్లులను మాత్రం అప్లోడ్ చేయకుండా వదిలేశారు.

ప్రాధాన్యత క్రమాన్ని మరచి..

హైకోర్టు సూచించిన విధంగా బిల్లుల చెల్లింపులో ప్రాధాన్యత క్రమంలో సీఎన్‌ఆర్ ప్రాజెక్టుకు బిల్లులను అప్లోడ్ చేయాల్సి ఉంది. సదరు కాంట్రాక్టర్ తాలూకు బిల్లులను ఎందుకు అప్లోడ్ చేయలేదో డ్రైనేజీ అధికారులే చెప్పాలి. బిల్లుల అప్లోడ్ వ్యవహారంలో వైసీపీ అనుకూల కాంట్రాక్టర్లు చక్రం తిప్పినట్లు కార్యాలయ వర్గాలో గుసగుసలు వినవస్తున్నాయి.

అంతా కలెక్టర్ ఆదేశాలతోనే..

తమ బిల్లును ఎందుకు అప్లోడ్ చేయలేదని డ్రైనేజీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కిరణ్‌బాబును సదరు సీఎన్‌ఆర్ కాంట్రాక్టు సంస్థ అడుగగా, తమకేమి తెలియదని, రాష్ట్ర ప్రభుత్వం, కలెక్టర్ ఆదేశాల మేరకు బిల్లులను అప్లోడ్ చేశామని సమాధానం ఇచ్చారు. కోర్టులో పర్సనల్ అప్పియరెన్స్ తాలూకు బిల్లులను మాత్రమే అప్లోడ్ చేశానని పేర్కొన్నారు. సిఎన్‌ఆర్ ప్రాజెక్టుకు చెందిన బిల్లుల పరంగా నగదు మొత్తం ఎక్కువగా ఉండటంతో అప్లోడ్ చేయలేదని ఇ.ఇకిరణ్‌బాబు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	104, 112, 123
చికెన్ విత్ స్కిన్	198
చికెన్ స్కిన్‌లెస్	208

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 530

గ్రామాభివృద్ధే లక్ష్యం: సర్పంచ్ వేము



గన్నవరం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామ అభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు సర్పంచ్ వేము రాధాకృష్ణ తెలిపారు. మండలంలోని ముస్తాబాద దక్షిణ బజార్‌లో డ్రెయినేజీ నిర్మాణ పనులను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాధాకృష్ణ మాట్లాడుతూ, దశాబ్దాల కాలంగా అభివృద్ధికి నోచుకోని డ్రెయినేజీ నిర్మాణానికి చర్యలు చేపట్టామన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డ్రెయినేజీ అభివృద్ధి ప నులపై దృష్టి సారించినట్లు తెలిపారు. 7వ వార్డు సభ్యులు గుంటూరు నాగేశ్వరరావు, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.



కానూరు వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం.. కంకిపాడులో.. ఏఎంసి చైర్మన్ అన్నే ధనయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరంలో పాల్గొన్న బోడె వెంకట్రామ్.. యనమలకుదురులో జన్మదిన వేడుకలు

ఘనంగా ఎమ్మెల్యే బోడె ప్రసాద్ జన్మదినం

- ఊరూవాడా టీడీపీ శ్రేణుల సంబరాలు
- కానూరు వృద్ధాశ్రమంలో వెలగపూడి శంకరబాబు అన్నదానం



పోరంకి టీడీపీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో అభిమానులు.. శొంఠి శివరాంప్రసాద్, పీతా గోపీచంద్ ఆధ్వర్యంలో ..

పెనమలూరు / కంకిపాడు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే బోడె ప్రసాద్ జన్మదిన వేడుకలను టీడీపీ శ్రేణులు వైభవంగా జరుపుకొన్నారు. బోడె దంపతులు విదేశీ పర్యటనలో ఉండడంతో వేడుకలను తనయుడు బోడె వెంకట్‌రామ్, అనుమోలు ప్రభాకరరావు, కోయ ఆనంద్‌ప్రసాద్‌లు అనేక చోట్ల నిర్వహించారు. పోరంకి టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకల సందర్భంగా కేకును కోసి అభిమానులకు పంచిపెట్టారు. యనమలకుదురులో జరిగిన వేడుకల్లో అనంతనేని ఆజాద్, మొక్కపాటి శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో అభిమానులు వేడుకలను నిర్వహించారు. శొంఠి శివరాంప్రసాద్, పీతా గోపీచంద్‌ల ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో అభిమానులు, టీడీపీ బీసీ నాయకులు బోడె జన్మదిన కేకులు కోసి పంచిపెట్టారు. సనత్‌నగర్‌లో జరిగిన వేడుకల్లో షేక్ బుజ్జి, టీడీపీ రెహమాన్‌లు అభిమానుల సమక్షంలో బోడె జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. టీడీపీ ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు కానూరు వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్ని రకాల వంటకాలతో కూడిన భోజనాన్ని తానే స్వయంగా వడ్డించారు.

కంకిపాడులో..

మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం నిర్వహించిన ఎమ్మెల్యే బోడె ప్రసాద్ జన్మదిన వేడుకల్లో ఆయన తనయుడు బోడె వెంకట్రామ్ పాల్గొన్నారు. కంకిపాడులోని బొప్పూడి శివరామకృష్ణ, జరగు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన బోడె జన్మదిన వేడుకల్లో వెంకట్రామ్ పాల్గొన్నారు. అనంతరం పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవినేని రాజా, గొంది శివరామకృష్ణ ప్రసాద్, తుమ్మలపల్లి హరికృష్ణ, సుదిమళ్ల రవీంద్ర, పులి శ్రీనివాసరావు, ఏనుగ జయప్రకాష్, చిట్టూరి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో ఏఎంసీ ఛైర్మన్ అన్నే ధనయ్య ఆధ్వర్యంలో బోడె ప్రసాద్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహిం చారు. ముందు కేకు కట్ చేశారు. అనంతరం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ ఛైర్మన్ ఎం. కల్యాణి, అనుమోలు ప్రభాకర్, సుదిమళ్ల రవీంద్ర, చలవాది రాజ, వణుకూరు విక్రం, కొండవీటి శివయ్య, కార్యదర్శి అప్పారావు, మార్కెట్‌యార్డ్ పాలకవర్గం, మార్కెట్ యార్డ్ సిబ్బంది పాల్గొన్నారు. ఈడుపుగల్లు సర్పంచ్ పందిపాటి ఇందిర ఆధ్వర్యంలో నిర్వహించిన బోడె ప్రసాద్ జన్మదిన వేడుకల్లో మాజీ ఎంపీపీ దేవినేని రాజా, గ్రామ పార్టీ అధ్యక్షులు షేక్ షకార్, జిల్లా కార్యదర్శి పందిపాటి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. తెన్నేరులో నిర్వహించిన బోడె ప్రసాద్ జన్మదిన వేడుకల్లో యార్లగడ్డ రాజా, కుటుంబరావు, నాని, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. మద్దూరులో నిర్వహించిన ఎమ్మెల్యే బోడె ప్రసాద్ జన్మదిన వేడుకల్లో మాజీ జెడ్పీటీసీ గొంది శివరామకృష్ణ ప్రసాద్, యనమదల మదన్, యనమదల వెంకటేశ్వరరావు, తీట్ల మధు, పండు, నాని తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు నాణ్యమైన కూరగాయలు

కంకిపాడు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు రైతుబజారు ద్వారా నాణ్యమైన కూరగాయలు అందుబాటులో ఉన్నాయి. గతంలో వైసీపీ హయాంలో రైతు బజారు పూర్తిగా వైసీపీ నాయకుల కనుసన్నల్లో ఉండేది. అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం రైతు బజారును ప్రక్షాళన చేసింది. ఈవో శ్రీనివాసరావును మార్చింది. కొత్తగా శ్రీకాంత్‌ను రైతుబజారు ఈవోగా తీసుకువచ్చారు. రైతు బజారులో నాణ్యమైన కూరగాయలు అందుబాటులో ఉన్నాయి. మొత్తం 41 స్టాల్స్‌కుగాను డ్వాక్రా, వికలాంగులు, రైతు సొసైటీలు, విజయమిల్క్‌కు 20 స్టాల్స్ కేటాయించగా, మరో 21 స్టాల్స్‌లో 34 మంది ఆకుకూరల రైతులకు కేటాయించారు.

ఘనంగా జన్మనక్షత్ర పూజలు

హనుమాన్‌జంక్షన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అభయాంజనేయ స్వామి దేవస్థానంలో బుధవారం స్వామి వారికి జన్మనక్షత్ర పూజలు ఘనంగా నిర్వహించారు. పూర్వాభాద్ర నక్షత్రం పురస్కరించుకొని ఉత్సవ విగ్రహానికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. స్థానిక స్వీట్ షాపు యజమాని కొల్లి పూర్ణ ఉత్సవమూర్తికి అభిషేకం నిర్వహించారు. ఉత్సవ విగ్రహంతో పాటు అభయాంజనేయ స్వామికి కూడా ప్రత్యేక అభిషేకాలు జరిపారు. దేవస్థానం ఈవో తారకేశ్వరరావు పర్యవేక్షణలో ఆలయ అర్చకులు మారేపల్లి సీతారామానుజాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.



ఆత్కూరులో పచ్చిరొట్ట పంటగా సాగు చేసిన నవధాన్యాలపైరును పరిశీలిస్తున్న అధికారులు

విత్తనశుద్ధితో తెగుళ్ల నివారణ

ఉంగుటూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : పైర్లపై తెగుళ్లు, చీడపీడలను మొదట్లోనే నివారించి, పంట దిగుబడులు పెంచుకోవడానికి విత్తనశుద్ధి చేయడమే సరైన మార్గమని మండల వ్యవసాయాధికారి గద్దె రమేష్ అన్నారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మండలంలోని పొట్టిపాడు, ఆత్కూరు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఉద్యానవన వ్యవసాయాధికారి చంద్ మాట్లాడుతూ, లాభసాటి వ్యవసాయం కోసం పంటమార్పిడి తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. అనంతరం ఆత్కూరులో నవధాన్యాలు(తొమ్మిది రకాల ధాన్యాలు)కలిపి పచ్చిరొట్ట పంటగా సాగుచేసిన పొలాన్ని వ్యవసాయాధికారులు సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో బి.దుర్గానాగేశ్వరరావు, వీఏఏలు రమాదేవి, రాణి, రైతులు పాల్గొన్నారు.

తక్కువ వడ్డీపై వ్యవసాయ రుణాలు

హనుమాన్‌జంక్షన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ఖాతాదారులు, రైతులకు మెరుగైన సేవలు అందించడానికి బ్యాంక్ ఆఫ్ ఇండియా నిరంతరం కృషి చేస్తోందని ఆ బ్యాంక్ విజయవాడ జోనల్ ఎస్ఏసీ విభాగం రాజేశ్‌కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక విజయవాడ రోడ్డులోని బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖలో ఖాతాదారుల సమావేశం నిర్వహించారు. అధిక వడ్డీకి డిపాజిట్లు సేకరణ, తక్కువ వడ్డీపై వ్యవసాయ రుణాలు సకాలంలో అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఖాతాదారులు నాగభూషణం, బొమ్మి రామచంద్రరావు, వీరమాచనేని రాంబాబులను సత్కరించారు. బ్రాంచీ మేనేజర్ సుధాకర్, బీఎస్ఏ వేగిరెడ్డి బాలాజీ పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా విద్యాబోధన జరగాలి

జిల్లా విద్యాశాఖ అధికారి పీవీజే రామారావు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖ అధికారి పీవీజే రామారావు

ఉయ్యూరు. జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : రాబోవు పదవతరగతి పరీక్షలకు ఇప్పటి నుంచే ప్రతి ఉపాధ్యాయుడు ప్రణాళికతో పాఠ్యాంశాలు బోధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి పీవీజే రామారావు అన్నారు. ఉయ్యూరు డివిజన్ 7 మండలాల ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులతో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. డీవైఈవో పద్మారాణి అధ్యక్షతన జరిగి సమావేశంలో ఆయన పాల్గొని ప్రధానోపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ పాఠశాలలు ప్రస్తుత విద్యా సంవత్సరంలో గణనీయంగా పెరుగుతున్నాయని, 6వ తరగతిలో చేరుతున్న విద్యార్థులకు మొదటి 40 రోజులు బ్రిడ్జికోర్సు నిర్వహించి సన్నద్దులు చేస్తున్నామన్నారు. తల్లికి వందనం లబ్ధిదారులందరికి నగదు జమ అయ్యిందని, మధ్యాహ్న భోజన పథకానికి సన్నబియ్యం అందజేయడంతో విద్యార్థులు ఇష్టంగా తింటున్నారని తెలియ జేశారు. ఉయ్యూరు హెచ్‌ఎం టీవీ నాగేశ్వరరావు, హెచ్‌ఎం అసోసియేషన్ ప్రసాద్, జిల్లా సైన్స్ అధికారి జాకీర్ హుస్సేన్, ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు గ్రహీత ఎం శ్రీనివాస్ పాల్గొన్నారు. జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలు సక్రమంగా నిర్వహించినందుకు జిల్లా విద్యాశాఖ అధికారిని ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు.

మట్టి తవ్వకాల్లో నిబంధనలు పాటించాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లోని చెరువుల్లో మట్టితవ్వకాలు జరిపే సమయంలో ప్రభుత్వ నిబంధనలు పాటించాలని, ఉల్లఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ మురళీకృష్ణ హెచ్చరించారు. వీరవల్లి పెద్దచెరువులో జరు గుతున్న తవ్వకాలను బుధవారం వీఆర్వో సునీల్‌కుమార్, గ్రామస్తులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనుమతి ఇచ్చిన వాటికంటే లోతుగా మట్టి తవ్వినట్లు గుర్తించి బాధ్యులకు నోటీసు జారీ చేశారు. చెరువు గట్లకు 20మీటర్ల దూరం నుంచి మాత్రమే తవ్వకాలు జరగాలని, మీటరు లోతు మాత్రమే మట్టి తీయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ అమృతపల్లి సూర్యనారాయణ, ఉప సర్పంచ్ లంక అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కూటమితోనే అభివృద్ధి, సంక్షేమం

ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



ఎన్డీఆర్ఎఫ్ రోడ్డులో వంతెన నిర్మాణానికి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనలతో కూడిన రాష్ట్ర పునర్నిర్మాణం కోసం ప్రజల ఆశీర్వాదంతో ఏర్పాటైన ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజా పాలనలో ఏడాది పూర్తి చేసుకుందని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. మండలంలోని కొండపావులూరు సర్వే నెంబర్ 6లో ఎన్డీఆర్ఎఫ్ క్యాంపస్‌కు వెళ్లే మార్గంలో నూతన వంతెన నిర్మాణానికి మంగళవారం రాత్రి శంకుస్థాపన చేశారు. ఎన్డీఆర్ఎఫ్ అధికారులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం పెంచాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులకు చేయూత అందిస్తే ఆత్మ విశ్వాసంతో లోపాలను అధిగమించి ముందడుగు వేస్తారని హెచ్‌ఎం నిర్మల అన్నారు. వీరవల్లి హైస్కూల్ హెచ్‌ఎం నిర్మల ఆధ్వర్యంలో బుధవారం జరిగిన కార్యక్ర మం లో ఆదిత్య బధిరుల శిక్షణాలయం ప్రిన్సిపాల్ ఆకుల వెంకట రమణకు రూ.10వేల విరాళాన్ని విశ్రాంత ఉపాధ్యాయురాలు పార్వతీదేవి అందజేశారు. రమణగోపాల్, గోవర్ధన్ పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యవంతమైన జీవనశైలి

ఉంగుటూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవడంలో యోగా శక్తివంతమైన సాధనంలా పనిచేస్తుందని, ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను అంతర్భాగంగా చేసుకోవాలని తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జీవీకేఎస్‌వీ ప్రసాద్ అన్నారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగానికి చెందిన విద్యార్థులు యోగాంధ్ర ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వి.శ్రీహరిబాబు, ప్రొఫెసర్ మురళీకృష్ణ, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

యోగాంధ్రను విజయవంతం చేయాలి

హనుమాన్‌జంక్షన్ : ప్రతి సచివాలయంలో జూన్ 21న యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించే విధంగా ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పని చేయాలని కలెక్టర్ డీకే బాలాజీ జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. యోగాంధ్ర - 2025 కార్యచరణపై బుధవారం జేసీ గీతాంజలి శర్మతో కలిసి సచివాలయ సిబ్బందితో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. అందులో భాగంగా బాపులపాడు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కె. జోగేశ్వరరావు ఆధ్వర్యంలో మండలంలోని సచివాలయ సిబ్బంది వీసీకి హాజరయ్యారు.



బ్రెయిన్ సర్జరీ చేయించుకుని కోలుకుంటున్న పూర్ణచంద్రరావును పరిశీలిస్తున్న డాక్టర్ జాన్‌డేవిడ్

హోప్‌లో విజయవంతంగా బ్రెయిన్ సర్జరీ

ఉయ్యూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల రోడ్డు ప్రమాదంలో తలకు గాయమై మెదడులో రక్తం చేరి లెగ్‌మెంట్ గాయాలతో హాస్పిటల్‌కు వచ్చిన ఎస్. పూర్ణచంద్రరావుకు మూడు మేజర్ ఆపరేషన్లు విజయవంతంగా చేసి కోలుకునేలా మెరుగైన వైద్యసేవలందించినట్టు ఉయ్యూరు హోప్ హాస్పిటల్ అధినేత డాక్టర్ జాన్‌డేవిడ్ తెలిపారు. హాస్పింటల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ జాన్‌డేవిడ్ పూర్ణచంద్రరావుకు చేసిన శస్త్రచికిత్సలు, వైద్యం గురించి వివరించారు. ఉయ్యూరు ప్రాంతంలో జరిగిన మొట్టమొదటి మేజర్ సర్జరీ హోప్ హాస్పిటల్‌లో జరగడం గర్వకారణమన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండండి

ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తనయుడు వెంకట్రామ్



కంకిపాడు పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ

కంకిపాడు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందే విధంగా కృషి చేయాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తనయుడు బోడె వెంకట్రామ్ అన్నారు. కంకిపాడు తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణతో కలిసి బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవినేని రాజా, మండల పార్టీ అధ్యక్షులు సుదిమళ్ల రవీంద్ర, ఏఎంసీ డైరెక్టర్ గోగినేని వెంకట రమణ, కంకిపాడు పార్టీ అధ్యక్షులు చిట్టూరి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కొండా నాగేశ్వరరావు, యూని ట్ ఇన్‌చార్జి పులి శ్రీనివాసరావు, స్థానిక టీడీపీ నాయకులు ఏనుగ జయప్రకాష్, శ్యామ్, కాకుమాను రమేష్, షేక్ బాజీ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యుల నూతన కమిటీ

ఉయ్యూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రథమ చికిత్స, వైద్యసేవ లందిస్తున్న గ్రామీణ వైద్యుల సేవలు ఎనలేనివని అను హాస్పిటల్ ఛైర్మన్ డాక్టర్ ఎమ్ సౌమ్య కొనియాడారు. స్థానిక నాగళ్ల రాజేశ్వరమ్మ విజ్ఞాన మందిరంలో బుధవారం గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం జరిగిన వైద్య విజ్ఞాన అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పక్షవాతం వస్తే వెంటనే తీసుకోవాలిసిన జాగ్రత్తలను డాక్టర్ రమేశ్ వివరించారు. గ్రామీణ వైద్యుల ఉయ్యూరు నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేసింది. అధ్యక్షుడిగా తమ్మన ఉమామహేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎ.వెంకటేశ్వరరావు, కోశాధికారిగా నాగబాబుతో పాటు ఉపాధ్యక్షులు, జాయింట్ సెక్రటరీతో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంకటరాజు ప్రమాణస్వీకారం చేయించారు.

సంగమ ప్రాంతాలపై నిర్లక్ష్యపు నీడ

అభివృద్ధికి దూరంగా పవిత్ర సంగమం, సాగర సంగమం


సౌకర్యాలు లేకున్నా సందడిగా మారిన పవిత్ర సంగమం

- మౌలిక సదుపాయాలు లేక పర్యాటకుల అవస్థలు
- కనీస వసతులు కల్పించకుండా హంసలదీవిలో టోల్ వసూళ్లా..!
- రివర్ ఫ్రంట్, బీచ్ టూరిజం ప్రాంతాలుగా అభివృద్ధి చేయాలి

రాష్ట్రంలోని రెండు అద్భుతమైన సంగమ క్షేత్రాలు హంసలదీవిలోని సాగర సంగమం, ఇబ్రహీంపట్నంలోని పవిత్ర సంగమం. పర్యాటక రంగంలో ఎంతో ఆదరణ పొందినప్పటికీ, నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. కృష్ణమ్మ సముద్రంలో కలిసే హంసలదీవి, గోదావరి-కృష్ణానదులు సంగమించే ఇబ్రహీంపట్నం ఈ రెండూ సహజ సిద్ధమైన ప్రదేశాలు. రివర్ ఫ్రంట్, బీచ్ టూరిజంగా అభివృద్ధి చేసేందుకు ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో ఇవి ఎంతో అనువైనవి. ఒకప్పుడు ఈ ప్రాంతాలు వెలుగులో మెరిసినవే. కానీ, కాలక్రమేణా నిర్లక్ష్యం వల్ల పర్యాటకులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తగిన మౌలిక సదుపాయాలు లేకపోయినా, ఈ ప్రాంతాలకు పెద్ద ఎత్తున సందర్శకులు వస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విజన్-2047ను సాకారం చేయాలంటే ఈ రెండు సంగమ క్షేత్రాలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి.

- ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం/కోడూరు

ఇబ్రహీంపట్నంలో గోదావరి, కృష్ణానదులు కలిసే పవిత్ర సంగమం 2014లో టీడీపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆరంభమైంది. పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను కృష్ణానదిలో కలిపి, ఈ సంగమానికి పవిత్ర సంగమం అని నామకరణం చేశారు. 2 కిలోమీటర్ల నదీతీరంలో రివర్ ఫ్రంట్ ఘాట్లు, స్నాన ఘాట్లు ఏర్పాటు చేసి పర్యాటకులకు అనేక మౌలిక సదుపాయాలు కల్పించారు. నిత్యహారతులు, కొండపల్లి ఖిల్లాపై లేజర్ షోలతో ఈ ప్రాంతం ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా ఒక వెలుగు వెలిగింది. రాష్ట్రంతోపాటు దేశవ్యాప్తంగా సందర్శకులను ఆకర్షించింది. ప్రతి సాయంత్రం వేలాది మంది నిత్యహారతులను వీక్షించేందుకు చేరుకునేవారు. కానీ, 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ ప్రాంతం చీకటిలోకి నెట్టబడింది. నిత్యహారతులు ఆగిపోయాయి, అభివృద్ధి పనులు స్తంభించాయి. ఐదేళ్ల పాలనలో ఒక్క పని జరగలేదు. 2024లో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా అభివృద్ధి పనులు ప్రారంభం కాలేదు. ముగ్గురు మంత్రులు సందర్శించి, నిత్యహారతులు తిరిగి ప్రారంభిస్తామని హామీ ఇచ్చి 9నెలలు గడిచినా అమలు కాలేదు.

ఇదీ హంసలదీవి దుస్థితి..!

హంసలదీవిలో కృష్ణానది సముద్రంలో కలిసే సాగర సంగమం మరో అద్భుత దృశ్యం. ఈ బీచ్ ప్రాంతం తెలుగు రాష్ట్రాల్లోనే కాక, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి కూడా పర్యాటకులను ఆకర్షిస్తుంది. సమీపంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం దీని ఆధ్యాత్మిక విలువను పెంచుతుంది. కానీ, సరైన మౌలిక సదుపాయాలు లేకపోవడంతో పర్యాటకులు దూరమవుతున్నారు. పాలకాయ తిప్ప నుంచి బీచ్‌కు వెళ్లే రహదారి పాడైపోయింది, కనీస మరమ్మతులు కూడా జరగడం లేదు. అటవీ శాఖ అధికారులు సౌకర్యాలు కల్పించకుండానే టోల్ వసూలు చేయడం సందర్శకులపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. మరుగుదొడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయి, మహిళలకు దుస్తులు మార్చుకునే సౌకర్యం లేదు. మంచినీరు కావాలంటే 2 కిలోమీటర్ల దూరంలోని పాలకాయ తిప్పకు వెళ్లాల్సిందే. స్థానిక వ్యాపారులను సముద్రతీరంలో విక్రయాలకు అనుమతించకపోవడంతో వారు జీవనోపాధి కోల్పోతున్నారు. ఈ పరిస్థితుల వల్ల ఇటీవల సందర్శకుల సంఖ్య తగ్గిందని స్థానికులు వాపోతున్నారు.


సాగర సంగమం వద్ద పర్యాటకులు


నిరుపయోగంగా బయో టాయిలెట్స్

ఇలా చేస్తే..

ఈ రెండు సంగమ క్షేత్రాలు రాష్ట్ర పర్యాటక రంగంలో మణిపూసలుగా మారే అవకాశం ఉంది. పవిత్ర సంగమంలో నిత్యహారతులను పునరుద్ధరించి, రివర్ ఫ్రంట్ సౌకర్యాలను మెరుగుపరచాలి. హంసలదీవిలో రహదారులు, మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యాలను అభివృద్ధి చేయాలి. టోల్ వసూలును తాత్కాలికంగా నిలిపివేసి, స్థానిక వ్యాపారులకు అవకాశం కల్పించాలి. ప్రభుత్వం, ప్రైవేటు సంస్థల సహకారంతో ఈ ప్రాంతాలను అభివృద్ధి చేస్తే, స్థానిక ఆర్థిక వ్యవస్థ బలపడడంతోపాటు రాష్ట్రానికి ఆదాయం పెరుగుతుంది. ఈ సంగమ క్షేత్రాలను పర్యాటక ప్రాంతాలుగా మార్చడం ద్వారా, రాష్ట్రం తన విజన్ - 2047కు ఒక అడుగు దగ్గరవుతుంది. కానీ, ఇందుకు జిల్లా అధికారులు, పర్యాటక శాఖ తక్షణ చర్యలు తీసుకోవాలి. ఈ ప్రాంతాల సహజ సౌందర్యం, ఆధ్యాత్మిక విలువలను కాపాడుతూ, వాటిని ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దే బాధ్యత ప్రభుత్వంపై ఉంది.


శిథిలావస్థకు చేరిన సంగమానికి వెళ్లే రహదారి

జగన్ లాంటి ఉన్మాది ప్రజాస్వామ్యానికి ప్రమాదకారి

- టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నే

వన్‌టౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జగన్ లాంటి ఉన్మాది ప్రజాస్వామ్యానికి ప్రమాదకారి అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్ (అన్నా) అన్నారు. బుధవారం విజయవాడ హనుమాన్‌పేటలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డికి బుధవారం పల్నాడు పర్యటనకు పోలీసులు కేవలం 100 మందికి మాత్రమే అనుమతివ్వగా, వైసీపీ నేతలు వేలాది మందిని సమీకరించి బలప్రదర్శన చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడారన్నారు. ఫలితంగా ఇద్దరు అమాయకులు ప్రాణాలు కోల్పోయారన్నారు. జగన్ పరామర్శ పేరుతో ఒక్కరిని కలవడానికి వచ్చి మరో ఇద్దరి మరణానికి కారణమవడం విషాదకరమన్నారు. వైకాపా నాయకత్వం ఎంత బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తుందో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చన్నారు. జరిగిన ఘటనపై జగన్ స్పందించకుండా పర్యటన కొనసాగించడం మరింత దారుణమని, తన పర్యటనతో ప్రాణనష్టమొచ్చినా స్పందించని వ్యక్తి ప్రజల బాగోగులు చూస్తాడని ఎలా నమ్మాలని ప్రశ్నించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం: కలెక్టర్ లక్ష్మీశ

సత్యనారాయణపురం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రోజువారీ జీవితంలో ఎదురయ్యే ఒత్తిళ్లను ఎదుర్కొనేందుకు యోగా ఎంతగానో ఉపయోగపడుతుందని కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. బీఆర్‌టీఎస్ రోడ్డు యోగా స్ట్రీట్‌లో జిల్లా అధికారులు, వీఎంసీ ఆధ్వర్యంలో బుధవారం థీమ్ యోగా జరిగింది. వివిధ బ్యాంక్ అధికారులు, సిబ్బందితో కలిసి కలెక్టర్ యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో యోగాంధ్రకు విశేష స్పందన వస్తుందన్నారు. ఇంటర్నేషనల్ వాసవీ క్లబ్ మాజీ అధ్యక్షుడు వేముల హజరత్తయ్యగుప్తా మాట్లాడుతూ రోజూ యోగాతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చునన్నారు.

యూబీఐ రీజనల్ హెడ్ ఎంవీ తిలక్, గౌతమ్ లక్ష్మీనారాయణ, కే ప్రియాంక, ఎస్‌బీఐ ఆర్‌ఎం శ్రీనివాస్, ఇండియన్‌బ్యాంక్ జోనల్ మేనేజర్ రాజేష్, వీఎంసీ అదనపు కమిషనర్ డీ చంద్రశేఖర్ అదితరులు పాల్గొన్నారు.

అరుణ్ కుమార్ జైన్ సేవలు శ్లాఘనీయం

- సికింద్రాబాద్‌లో జరిగిన అభినందన సభలో కార్మిక సంఘాల నేతలు


సభలో ప్రసంగిస్తున్న అరుణ్‌కుమార్ జైన్

రైల్వే స్టేషన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ సేవలు శ్లాఘనీయమని కార్మిక సంఘాల నేతలు పేర్కొన్నారు. అరుణ్ కుమార్ జైన్ ఈనెల 30న పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా సికింద్రాబాద్ రైల్ నిలయంలో బుధవారం ఎస్‌సీఆర్‌ఎంయూ, హెచ్‌ఎంఎస్ ఆధ్వర్యంలో అభినందన సత్కార సభ జరిగింది. ఈ సందర్భంగా నేతలు అరుణ్ కుమార్ జైన్ సేవలను విస్తృతంగా పేర్కొంటూ అభినందించారు. ఆలిండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్‌కు అనుబంధ సంస్థ అయిన సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ (ఎస్‌సీఆర్‌ఎంయూ) హిందూ మజ్దూర్ సభల సంయుక్త ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని ఎస్‌సీఆర్ ఎంయూ సెంట్రల్ ఆఫీసులో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు ప్రసంగించారు. ఎస్‌సీఆర్‌ఎంయూ ప్రెసిడెంట్ కే శ్రీనివాస్ అరుణ్ కుమార్ జైన్ సాధించిన విజయాలను, ప్రగతిని ప్రశంసించారు. జనరల్ సెక్రటరీ డాక్టర్ సీహెచ్ శంకర్‌రావు మాట్లాడుతూ అరుణ్ కుమార్ జైన్‌ను స్ఫూర్తిగా తీసుకుని ఇక ముందు రాబోయే జనరల్ మేనేజర్లు అభివృద్ధితో పాటు రైల్వే ఉద్యోగుల శ్రేయస్సుకు కూడా పాటుపడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎస్‌సీ రైల్వే అదనపు జనరల్ మేనేజర్ నీరజ్ అగర్వాల్ మాట్లాడుతూ అరుణ్ కుమార్ జైన్ మార్గదర్శకత్వంలో తీసుకున్న చర్యలను కొనియాడారు. ఎస్‌సీఆర్‌ఎంయూ నేతలు కూడా ఎంతో సహకరించారన్నారు. తనకు జరిగిన సత్కారానికి కృతజ్ఞతలు చెబుతూ అరుణ్ కుమార్ జైన్ తన ప్రసంగంలో యూనియన్ నాయకత్వాన్ని కొనియాడారు. రైల్వే ఉద్యోగులు, వారి కుటుంబాల సంక్షేమానికి ఎంతో పాటుపడ్డారని చెప్పారు. తాను జనరల్ మేనేజర్‌గా ఉన్న కాలంలో సహకరించిన వారందరికీ అభినందనలు తెలిపారు. సెంట్రల్, డివిజనల్ ఆఫీస్ యూనియన్ బాధ్యులు, హైదరాబాద్, సికింద్రాబాద్ ఏరియా పరిధిలోని లోకల్ ఆఫీసు బ్రాంచి, ఆఫీసుల బాధ్యులు, శాలువాలతో, పుష్పగుచ్ఛాలతో అరుణ్ కుమార్ జైన్‌ను సత్కరించారు. ఎస్‌సీఆర్‌ఎంయూ అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ జి.ఉదయభాస్కర్‌రావు సభకు స్వాగతం పలికారు. జోనల్ ట్రెజరర్ ఎస్ సరోజినీరెడ్డి వందన సమర్పణ చేశారు.

క్రైస్తవ మైనార్టీల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె


కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఈటె స్వామిదాసు

విద్యాధరపురం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవ మైనార్టీల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలుగుదేశం పార్టీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాసు పేర్కొన్నారు. బుధవారం పున్నమిఘాట్‌లో జరిగిన ఆంధ్రప్రదేశ్ బిషప్ కౌన్సిల్ సమావేశంలో టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామిదాసు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో సీఎం చంద్రబాబు సీఎంగా ఉంటేనే అన్ని వర్గాల ప్రజలు బాగుపడతారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో గుంటూరు-విజయవాడ సమీపంలో రెండెకరాలు స్థలం కేటాయించి, క్రిస్టియన్ భవన్ ఏర్పాటుకు రూ.10 కోట్లు నిధులు విడుదల చేశారన్నారు. 80 శాతం పూర్తయిన క్రిస్టియన్ భవనాన్ని వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిందన్నారు. క్రైస్తవులు వ్యాపారం చేసుకునేందుకు వీలుగా రూ.లక్ష సబ్సిడీపై 2,494 మందికి బడ్జెట్ విడుదల చేశారన్నారు. ఏపీ బిషప్ కౌన్సిల్ అధ్యక్షుడు బాలరాజు, జేఏసీ ప్రధాన కార్యదర్శి మన్నెం జానయ్య, బిషప్‌లు డేవిడ్ రాజు, మల్లెల విజయ్ భాస్కర్, సంతోష్‌తో పాటు 250 మంది పాల్గొన్నారు.


ఆముదార్లంక కృష్ణానదీ తీరాన జిల్లా సరిహద్దులు నిర్ణయిస్తున్న ఆర్డీవోలు స్వాతి, రామలక్ష్మి, చిత్రంలో అధికారులు, పోలీసులు

ఆముదార్లంక కృష్ణాతీరాన

జిల్లాల సరిహద్దుల గుర్తింపు

- ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు : ఆర్డీవోలు

చల్లపల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): భౌగోళికంగా గుంటూరు జిల్లాలో అంతర్భాగంగా ఉండే చల్లపల్లి మండలం ఆముదార్లంక కృష్ణాతీరంలో కృష్ణా-గుంటూరు జిల్లాల సరిహద్దులను బుధవారం అధికారులు నిర్ణయించారు. ఆముదార్లంక పరిధిలోని రేవులోంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతుండగా, ఆముదార్లంక - జువ్వలపాలెం వాసుల నడుమ సరిహద్దుల విషయమై వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో కృష్ణా-గుంటూరు జిల్లాల కలెక్టర్ల ఆదేశాల మేరకు రెండు జిల్లాల అధికారులు రంగంలోకి దిగి సరిహద్దులను నిర్ణయించారు. మచిలీపట్నం ఆర్డీవో స్వాతి, రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి నేతృత్వంలో రెవెన్యూ, పోలీసు, సర్వే అధికారులు బుధవారం ఆముదార్లంక వద్ద బౌండరీలు నిర్ణయించారు. రెండు మూడు రోజుల్లో సిమెంటు స్తంభాలు పాతి బోర్డులు ఏర్పాటు చేస్తామని ఆర్డీవోలు స్వాతి, రామలక్ష్మి తెలిపారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. రీచ్‌లు లేనప్పటికీ నదీపరీవాహక ప్రాంతాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు చేపట్టరాదని స్పష్టం చేశారు. ట్రాక్టర్లు, ఎడ్లబండ్లపై ఇసుక తరలించినా చర్యలు తీసుకుంటామన్నారు. ఇసుక తవ్వకాలపై నిషేధం ఉన్న నేపథ్యంలో ఇసుక కావాలంటే రీచ్ పాయింట్లలోని స్టాక్‌పాయింట్లలోనే ఇసుక కొనుగోలు చేసుకోవాల్సి ఉంటుందని స్పష్టంచేశారు. తహసీల్దార్‌లు డి.వనజాక్షి, వెంకటేశ్వర్లు, సీఐలు యువకుమార్, వీరాంజనేయులు, ఎస్‌ఐ వీఎస్‌వీ సుబ్రహ్మణ్యం, సర్వే అధికారులు దుర్గాప్రసాద్, హర్షవర్ధన్, వల్లీపుష్ప, ఆర్‌ఐ ఘంటసాల కృష్ణమోహన్, స్థానిక అధికారులు పాల్గొన్నారు.



'విజయవాడ-విశాఖ' అమరావతి ఏసీ బస్సుల్లో నెలరోజుల పాటు

10 శాతం రాయితీ

బస్టేషన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): విజయవాడ - విశాఖపట్నం మధ్య నడుస్తున్న అమరావతి ఏసీ బస్సుల్లో ఈనెల 26 నుంచి జులై 24 వరకు చార్జీల్లో 10 శాతం రాయితీ ఇస్తున్నట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎంవై దానం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని అమరావతి ఏసీ బస్సుల్లోనూ రూ.1070 చార్జీకిగాను రూ.970 మాత్రమే వసూలు చేస్తారన్నారు. మరోవైపు రాను, పోను టిక్కెట్లను రిజర్వ్ చేసుకున్నవారికి కూడా 10 శాతం రాయితీ లభిస్తుందన్నారు.

పూరి రథయాత్రకు ప్రత్యేక బస్సులు

ఈనెల 27న పూరీలో జరగనున్న జగన్నాథ్ రథయాత్రను పురస్కరించుకుని పీఎన్‌బీఎస్ నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎంవై దానం తెలిపారు. ఈ బస్సులు ఈనెల 25న రాత్రి 10 గంటలకు బస్టేషన్ నుంచి బయలుదేరతాయి. 26న అన్నవరం, సింహాచలం, విశాఖపట్నం ఆర్కే బీచ్‌ను చూసుకుని సాయంత్రం 6 గంటలకు బయలుదేరతాయి. 27న కోణార్క్ సూర్యదేవాలయం చేరుకుంటాయి. అక్కడ దర్శనానంతరం పూరీ జగన్నాథుని దర్శనం, రథయాత్ర నుంచి 27న రాత్రి ఒంటి గంట వరకు కూడా అక్కడే ఉండి అక్కడి నుంచి బయలుదేరి మళ్లీ రాత్రి 7 గంటలకు విజయవాడ చేరుకుంటారు. సూపర్ లగ్జరీ, హైటెక్ ప్రయాణానికి ఒక్కొక్కరికి రూ.3,600, ఇంద్ర ఏసీ ఒక్కొక్కరికీ రూ.4,800 చార్జీ చెల్లించాల్సి ఉంటుంది. ఆన్‌లైన్, లేదా ఆర్టీసీ అధీకృత టిక్కెట్ బుకింగ్ ఏజెంట్ల ద్వారా రిజర్వేషన్ చేసుకోవచ్చునన్నారు. 30మంది గ్రూప్‌గా ఉన్నట్టయితే వారి నివాస ప్రాంతం నుంచే బస్సును ఏర్పాటు చేస్తామన్నారు. ప్రయాణంలో భోజనం, ఇతర ఖర్చులన్నీ ప్రయాణికులే భరించాల్సి ఉంటుందన్నారు. తిరువూరు, జగ్గయ్యపేట నుంచి కూడా 30 మంది ఉన్నట్టయితే అక్కడి నుంచే బస్సులు బయలుదేరతాయన్నారు. వివరాలకు 8074298487 (విజయవాడ) 9515860465 (తిరువూరు) 8247451915 (విజయవాడ) 7382893197 (జగ్గయ్యపేట)లో సంప్రదించవచ్చన్నారు.

ఐకానిక్ అసెంబ్లీ పనులు ప్రారంభం!


పునాదుల కోసం గుంతలు తీసేందుకు వచ్చిన డ్రిల్లర్, పనిముట్లు, పిల్లర్ బాక్స్

గుంటూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి గుండెకాయ అయిన ఐకానిక్ అసెంబ్లీ నిర్మాణ ప్రక్రియ ఎట్టకేలకు ప్రారంభమయింది. రాజధాని మొత్తానికి తలమానికమైన ఈ నిర్మాణ కాంట్రాక్టును పొందిన ఇంజనీరింగ్ సంస్థ సోమవారం నుంచి పనులను ప్రారంభించింది. నిర్మాణ ప్రాంతంలోకి భారీ డ్రిల్లర్లు, సరంజామాను తరలించుకుని ఏర్పాట్లు చేసుకుంటోంది.

2 నెలలుగా కొనసాగుతున్న పనులు

రాజధాని అమరావతిలో 103 ఎకరాల్లో దాదాపు 11.22 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో 250 మీటర్ల ఎత్తులో వ్యూ పాయింట్ ఉండేలా నిర్మిస్తున్న అత్యంత ప్రతిష్ఠాత్మక నిర్మాణం కావడంతో నిర్మాణ సంస్థ అనేక జాగ్రత్తలు తీసుకుంటోంది. రెండు నెలలుగా అక్కడి భూమి స్వభావం, నాణ్యతపై అధ్యయనం చేస్తోంది. నిర్మాణానికి కావాల్సిన మెజర్మెంట్స్ తీసుకుంటోంది. ఆ పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. కాగా సోమవారం నుంచి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. భారీ డ్రిల్లర్లను నిర్మాణ స్థలంలోకి తరలించి సిద్ధం చేసుకుంటున్నారు. నిర్మాణ పునాదుల కోసం కావాల్సిన గుంతలు తీసే పనులు ప్రారంభించారు.

గతవారమే మొదలైన జీఏడీ టవర్ల పనులు

కిందటివారమే జీఏడీ, సెక్రటేరియట్ టవర్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. పరిపాలానా భవనాన్ని 17.03 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో 47 అంతస్తులతో నిర్మిస్తున్నారు. దీంతోపాటు 68.88 లక్షల చదరపు అడుగులు విస్తీర్ణంలో 40 అంతస్తులు ఉండేలా సెక్రటేరియట్ భవనాలను నిర్మించాలని ప్రభుత్వం భావించింది. దీనికి సంబంధించిన ఎల్‌ఓసీలు ఈనెల 2న పూర్తయ్యాయి. మొత్తం రూ. 3,673.44 కోట్లకు టెండర్లు ఖరారయ్యాయి. దీంతో సెక్రటేరియట్ టవర్ 1, టవర్ 2ల పనులు ప్రారంభమయ్యాయి. కిందటి వారమే పనులు ప్రారంభం కావడంతో పునాదుల్లోకి చేరిన నీరు, బురదను ఇప్పటికే పూర్తిగా తొలగించివేశారు. ఇప్పటికే కొంతమేర పూర్తై ఉన్న రాఫ్ట్ ఫౌండేషన్ల వద్ద సేఫ్‌హోల్డులు నిర్మించుకుని తదుపరి పనులకు సన్నద్ధమవుతున్నారు. భారీ వాహనాలు నేరుగా రాఫ్ట్ ఫౌండేషన్ వద్దకు చేరుకునేలా రోడ్ల నిర్మాణాన్ని కూడా పూర్తి చేసుకున్నారు. పాడైపోయిన ఐరన్ రాడ్లను వెల్డింగ్ ద్వారా కట్ చేసి తొలగిస్తున్నారు.

దేశానికి సుదీర్ఘ సేవలందించిన మహనీయుడు జగ్జీవన్‌రామ్: మంద కృష్ణమాదిగ

రాణిగారితోట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): దేశానికి సుదీర్ఘ సేవలు చేసిన మహనీయుల్లో మొదటి వరసలో ఉండే వ్యక్తి బాబూ జగ్జీవన్ రామ్ అని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణ మాదిగ అన్నారు. రాణిగారితోట 17వ డివిజన్ ఫీడర్ రోడ్డులో ఆదివారం బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహ ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో కలిసి విగ్రహావిష్కరణ చేశారు. అనంతరం మాట్లాడుతూ తెలుగు ప్రజలు ఆత్మగౌరవాన్ని, ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు ఎన్టీఆర్ విగ్రహం పక్కనే మరో మహనీయుడు జగజ్జీవన్ రామ్ విగ్రహన్ని కూడా ఏర్పాటు చేయడం మంచి కార్యక్రమమన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని కులవ్యవస్థ మన దేశంలో ఉందని, దానివలన ఏ కులంలో పుట్టి సేవ చేసిన ఆ సేవ చేసిన వ్యక్తిని అన్ని కులాల వారు గౌరవించుకునే సంప్రదాయం ఇంకా రాలేదని ఇది చాలా దురదృష్టకరమన్నారు. దేశంలో కుల వ్యవస్థ లేకపోతే మాజీ ఉపప్రధాని జగ్జీవన్ రామ్ చేసిన సేవలను ఈ దేశ సమాజం గుర్తించేదని, గౌరవించేదని, దేశంలోని అన్ని రాజకీయ నేతల ఇళ్లల్లో మహనీయుల విగ్రహాల స్థానంలో ఉండేదన్నారు. అనంతరం ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య ఉద్యమంలోనూ, స్వరాజ్యం వచ్చిన తరువాత ఆధునిక భారతదేశ నిర్మాణంలోనూ స్ఫూర్తివంతమైన సేవలు దేశానికి బాబూ జగ్జీవన్ రామ్ అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమానికి మంద కృష్ణమాదిగ రావడం చాలా సంతోషంగా ఉందని, ప్రధాని మోదీ గుర్తించే స్థాయికి మంద కృష్ణ మాదిగ ఎదిగారంటే ఆయన చేసిన ఉద్యమం వెనుక నిబద్ధత, నిజాయితీ ఉండడమేనన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పలు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు మంద కృష్ణ మాదిగ అండగా నిలబడ్డారన్నారు. బడుగు బలహీన వర్గాలకు తెలుగుదేశం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. స్థానిక ఎంఆర్‌పీఎస్ నేతలు పాల్గొన్నారు.


దుర్గమ్మ సన్నిధిలో శీనానాయక్

దుర్గగుడి ఈవో శీనా నాయక్‌కు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి

ఇంద్రకీలాద్రి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఈవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న శీనా నాయక్‌కు బుధవారం స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా ఈవో శీనా నాయక్ బుధవారం సాయంత్రం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద పండితులు వేద ఆశీస్సులు అందజేశారు. అధికారులు, ఉద్యోగులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.


ప్రమాదానికి గురైన బైక్, గణేష్ మృతదేహం

సముద్రపు ఒడ్డున మృతదేహం

- మృతిపై పలు అనుమానాలు

మచిలీపట్నం టౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): సముద్ర స్నానాలకు వచ్చి ఒడ్డున బైక్‌పై స్పీడ్‌గా డ్రైవ్ చేస్తూ కిందపడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం సాయంత్రం మంగినపూడి బీచ్‌లో జరిగింది. స్థానికుల సమాచారం మేరకు ముదినేపల్లికి చెందిన గణేష్ (34) సముద్ర స్నానానికి వచ్చి ఒడ్డున బైక్ రైడింగ్ చేస్తుండగా అదుపుతప్పి పైప్‌లైన్‌కు ఢీకొట్టాడు. దీంతో గణేష్ కిందపడి మృతి చెందాడు. అయితే ఈ ఘటన పలు అనుమానాలకు తావిస్తోంది. సముద్ర తీరం మట్టి మెత్తగా ఉంటుందని, బైక్‌పై నుంచి పడితే ప్రాణనష్టం జరగదని కొందరంటున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	104, 112, 123
చికెన్ విత్ స్కిన్	198
చికెన్ స్కిన్‌లెస్	208

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 530

పాడి రైతుల సంక్షేమమే ధ్యేయం

గుడ్లవల్లేరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : పాడి రైతుల సంక్షేమమే ధ్యేయంగా పాడి రైతులకు సహకారం అందిస్తూ సొసైటీ అభివృద్ధికి కృషిచేయాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సూచించారు. వడ్లమన్నాడులో పాల సొసైటీ అధ్యక్షుడిగా ఎంపికైన పుల్లేటి రాజాప్రసాద్‌ను బుధవారం ఎమ్మెల్యే సత్కరించారు. ఈ కార్యక్రమంలో వడ్లమన్నాడు టీడీపీ గ్రామ అధ్యక్షుడు పామర్తి సత్తిబాబు, ప్రధాన కార్యదర్శి తోట రమేష్, గ్రామ ఉపసర్పంచ్ గరికపాటి రాంబాబు పాల్గొన్నారు.



పుల్లేటి రాజాప్రసాద్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల



చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న శివరామకృష్ణ

సీఎం, డిప్యూటీ సీఎం, లోకేశ్ చిత్రపటాలకు పాలాభిషేకం

గుడివాడ రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం కుటుంబంలో ఎంత మంది ఉంటే అంతమందికి తల్లికి వందనం నగదును అందజేసిందని మాజీ ఎంపీపీ గుత్తా శివరామకృష్ణ పేర్కొన్నారు. బుధవారం స్థానిక బొమ్మలూరులో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేశ్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. లబ్ధిదారులు పాల్గొన్నారు.

తూకాల్లో వ్యత్యాసాలు లేకుండా చూడాలి

● రైతు బజార్ ఎస్టేట్ అధికారి చంద్రమోహన్

కూచిపూడి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రైతు బజారుల్లో కూరగాయల ధరల్లో వ్యత్యాసం, తూకాల్లో తేడాలు లేకుండా చర్యలు చేపట్టనున్నట్లు కూచిపూడి రైతు బజార్ ఎస్టేట్ అధికారి చంద్రమోహన్ తెలిపారు. కూచిపూడి రైతు బజార్‌లోని దుకాణాలను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాల దృష్ట్యా రైతులు వారు పండించిన పంటను మధ్య దళారులు లేకుండా నేరుగా అమ్ముకునేందుకు వీలుగా 2017లో కూచిపూడిలో మోడల్ రైతు బజార్‌ను ప్రారంభించారన్నారు. ఈ రైతుబజార్‌లో 32 దుకాణాలు ఉండగా, ప్రస్తుతం 27 దుకాణాలు మాత్రమే నడుస్తున్నాయన్నారు. రైతు బజార్‌లో కేవలం రైతులే కాకుండా 60 శాతం మంది రైతులు, 40 శాతం మంది ఇతరులు వ్యాపారాలు నిర్వహిస్తున్నారని దుకాణాదారులు ఎస్టేట్ అధికారి దృష్టికి తీసుకొచ్చారు. దుకాణాల వద్ద ఎప్పటికప్పుడు ధరల పట్టికపై ఏరోజు కారోజు ఆరోజు ఏ ధరలకు అమ్మకాలు చేయాల్సి ఉందో పట్టికలో పొందుపర్చాలని దుకాణదారులకు సూచించారు. బయట మార్కెట్‌లో ధరలకు, రైతు బజార్ ధరలకు కిలో రూ.10కిపైగానే వ్యత్యాసం ఉంటుందన్నారు. కూరగాయలు తాజాగా ఉండటంతోపాటు ధరల వ్యత్యాసం వల్ల ఎక్కువ మంది ప్రజలు రైతు బజార్‌లోనే కూరగాయలు కొనుగోలు చేస్తున్నారన్నారు. విజయవాడ రైతు బజార్‌కు, కూచిపూడి ధరకు కిలోకు నాలుగైదు రూపాయలు వ్యత్యాసం ఉంటుంది. తూకంలో తేడాలు ఉంటున్నట్లు కొందరు కొనుగోలుదారులు వాపోతున్నారు. పరిశుభ్ర వాతావరణంలో రైతుబజార్ నిర్వహణ ఉండాలన్నారు. తాజా కూరగాయలను మాత్రమే విక్రయించాలని దుకాణదారులకు సూచించారు. అప్పుడే రైతు బజార్‌లో కూరగాయల కొనుగోలుకు ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారన్నారు.



రైతు బజార్‌లో దుకాణాలను పరిశీలిస్తున్న ఎస్టేట్ అధికారి చంద్రమోహన్

విద్యుత్‌కు అంతరాయం నేడు

తోట్లవల్లూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : పెనమకూరు సబ్‌స్టేషన్‌లో గురువారం విద్యుత్ లైన్లకు మరమ్మతుల చేపట్టనున్నామని మండల విద్యుత్ ఏఈ దేవదాసు ఒక ప్రకటనలో తెలిపారు. పెనమకూరు, కనకవల్లి గ్రామాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని ఆయన తెలిపారు.

అసత్య ప్రచారం చేస్తున్న వారిపై కేసు

గుడివాడ : సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్న వారిపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఫేస్‌బుక్, వాట్సప్ వంటి సోషల్ మీడియాలో మాజీ మంత్రి కొడాలి నాని కోల్‌కతాలో అరెస్టు చేసినట్టు ప్రచారం చేస్తూ పార్టీల మధ్య గొడవలు సృష్టించే వారిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు పంద్రాజు సాంబశివరావు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.

ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

● పామర్రు జనసేన ఇన్‌చార్జ్ నరేష్

పామర్రు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలలో గల నిరుద్యోగులు ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా ప్రైవేటు సంస్థలో అందించే అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ అనుభవం సాధించాలని పామర్రు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జీ తాడిశెట్టి నరేష్ పిలుపునిచ్చారు. స్థానిక ఆరేపల్లి కల్యాణమందిరంలో బుధవారం నియోజకవర్గస్థాయి నిరుద్యోగులకు ఏపీస్కిల్ డవలప్‌మెంట్ అధ్వర్యంలో బుధవారం జాబ్ మేళాను నిర్వహించారు. తొలుత జిల్లా ఉపాధికల్పనాధికారి డి. విక్టర్‌బాబు ఎమ్మెల్యే సోదరుడు వర్ల చైతన్య, మండల టీడీపీ అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్‌చంద్రతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించడమే ప్రధాన లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. ఈ మేళాకు ప్రైవేట్‌రంగ సంస్థలైన ముత్తూట్‌ఫైనాన్స్, అపోల ఫార్మసిస్, వరుణ్ మోటర్స్, సుధీర్ టింబర్‌డీపో, ముక్కు ఫైనాన్స్, టాటా క్యాపిటల్, బజాజ్ ఫైనాన్స్, తదితర ప్రైవేట్ సెక్టార్ సంస్థల వారు జాబ్ మేళాకు విచ్చేశారు. 275 మంది నిరుద్యోగుల్లో 128 మందిని ఎంపిక చేసుకొన్నారు. ఎంపికైన వారికి శిక్షణనిచ్చి అయాసంస్థలో ఉపాధి కల్పించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పామర్రు సాగునీటి సంఘం చైర్మన్ కోసరాజు వేంకటేశ్వరరావు, ఏరియా కో-ఆర్డినేటర్ తుర్లపాటి మధు, గుణ రంజన్ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న మాట్లాడుతున్న విక్టర్‌బాబు

గంగానమ్మ ఆలయ జీర్ణోద్ధరణకు విరాళాలు

గుడ్లవల్లేరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవల్లేరులోని గంగానమ్మ అమ్మవారి ఆలయ జీర్ణోద్ధరణ, నూతన ఆలయ నిర్మాణానికి, రమాసహిత సత్యనారాయణ స్వామివారి ఆలయ గోపుర జీర్ణోధరరణ, దశావతారాల మండపం, వ్రత మండప అభివృద్ధి పనులు వేగంగా నిర్వహిస్తున్నారు. ఈ తరుణంలో గుడ్లవల్లేరు గ్రామ ప్రముఖులు పారిశ్రామికవేత్త దివంగత వల్లభనేని వెంకటాద్రి జ్ఞాపకార్థం వారి సతీమణి ప్రమీలారాణి, వారి కుమారులు విజయవాడలో స్థిరపడిన పారిశ్రామిక, వాణిజ్యవేత్తలైన వల్లభనేని సుబ్బారావు, వల్లభనేని గోపాలకృష్ణ, వల్లభనేని రవిప్రసాద్‌లు రూ. 2,00,232 లు అభివృద్ధి కమిటీకి బుధవారం అందజేశారు. అలానే వల్లభనేని వాసుదేవరావు జ్ఞాపకార్థం వారి సతీమణి వల్లభనేని వెంకటరావమ్మ (చిట్టెమ్మ) వారి కుమారులు కర్ణాటకలో, హైదరాబాదుల్లో స్థిరపడిన శేషగిరి, సత్యనారాయణ రావు, మనవడు అజయ్ కృష్ణలు రూ.10,232లు, వెంకటాద్రి శశికళ దంపతులు, వారి కుటుంబ సభ్యులు రూ. 50 వేలు, గోపాలరత్న జాతీయ బిరుదాంకితులు వెంకట్రత్నం జ్ఞాపకార్థం సతీమణి బేబీసరోజని వారి కుటుంబ సభ్యులు రూ.20 వేలు, నంగడ్డ నారాయణ, వేములపల్లి నారాయణరావు, మిరియాల సతీష్ కుమార్‌లు రూ. 10వేల చొప్పున ఆలయ నిర్మాణ కమిటీకి వారికి అందజేశారు. కార్యక్రమంలో వెంకట్రావు, వల్లభనేని వెంకట సుబ్బారావు చౌదరి, ఉమామహేశ్వరరావు, రామకోటేశ్వరరావు, వెంకటరావు, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, వల్లభనేని వరప్రసాద్, మూల్పూరి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



విరాళాలు అందజేస్తున్న సుబ్బారావు, తదితరులు



కల్వపూడి అగ్రహారంలో ధర్నా చేస్తున్న నేతలు

విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించొద్దు

గుడివాడ రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఇళ్లకు విద్యుత్ స్మార్ట్‌మీటర్లను బిగించొద్దని ప్రజాపాలన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గుండాబత్తిన అంబేడ్కర్ డిమాండ్ చేశారు. కల్వపూడి అగ్రహారంలో స్మార్ట్ మీటర్లు బిగించటానికి వ్యతిరేకంగా బుధవారం గ్రామస్థులు ధర్నా నిర్వహించారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా జూలై 9వ తేదీన గుడివాడ బంద్‌కు మద్దతు తెలుపుతున్నట్టు తెలిపారు. ఉపాధ్యక్షురాలు వరిగంజి అమ్ములు, ఏసు, సోంబాబు పాల్గొన్నారు.

చెరువు అభివృద్ధికి నిధులు మంజూరు

గుడివాడ : దశాబ్దాలుగా ఆక్రమణలకు గురై, కుచించుకుపోయిన బేతవోలు చెరువును అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము నిధులను తీసుకురావడం అభినందనీయమని జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ అన్నారు. బుధవారం స్థానిక ప్రజావేదికలో ఎమ్మెల్యే వెనిగండ్లను బేతవోలు పెద్దలు, జనసేన నాయకులు కలిసి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. బూరగడ్డ మాట్లాడుతూ అమృత్ 2.0లో భాగంగా బేతవోలు ఊరచెరువు అభివృద్ధికి రూ.2.09కోట్లు నిధులను మంజూరు చేయించడంపై హర్షం వ్యక్తం చేశారు. జనసేన నేత సందు పవన్ పాల్గొన్నారు.

నీటితీరువా బకాయిలు చెల్లించాలి

పెదపారుపూడి: పెదపారుపూడి మండల పరిధిలో గల వ్యవసాయ భూములు ఉన్న ప్రతి ఒక్క రైతూ తమ భూమికి సంబంధించిన నీటి తీరువా వెంటనే చెల్లించాలని తహసీల్దార్ శ్రీను నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నీటి తీరువా చెల్లించని వారిపై జూలై ఒకటో తేదీ నుంచి 6 శాతం వడ్డీ విధించనున్నామన్నారు.

బెదిరిస్తున్న పిన్నిపై ఫిర్యాదు

గుడివాడ : కుటుంబ కలహాల నేపథ్యంలో తనను పిన్ని తిడుతూ, చంపుతానని బెదిరిస్తుందని, తనకు రక్షణ కల్పించాలని కోరుతూ స్థానిక సత్యనారాయణపురంలోని లక్ష్మీ ఎన్‌క్లేవ్‌కు చెందిన ఈడే దీప్తి టూటౌన్ పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు టూటౌన్ ఏఎస్సై జయబాబు తెలిపారు.

ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తప్పనిసరి

● ఎంఈవో -1 జి.జగన్మోహనరావు

గుడివాడరూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని విద్యార్థుల మనస్సుకు నచ్చే విధంగా పాఠాలు బోధించాలని ఎంఈవో -1 జి.జగన్మోహనరావు పేర్కొన్నారు. బుధవారం ఫాదర్ బియాంకి పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో హిమాచల్ ప్రదేశ్‌లోని ప్రభుత్వ పాఠశాలలు ఆదర్శంగా ఉన్నాయని, ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారని తెలిపారు. తల్లిదండ్రులు ఎక్కువ భాగం నిరక్షరాస్యులు కావటంతో హోంవర్క్ మొత్తం పాఠశాల ఆవరణలోనే పూర్తి చేయించటానికి కృషి చేయాలన్నారు. ప్రధానోపాధ్యాయులు ప్రతి రోజూ రికార్డులను తయారు చేయాలని, ఉన్నత పాఠశాలల్లో నాలుగు, మూడు విభాగాలుగా విభజించి వేరే ఉపాధ్యాయులకు ఆ పని చేయటానికి బాధ్యతలు అప్పగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 బాలాజీ ప్రాథమిక, యూపీ, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో జగన్మోహనరావు

కార్మికుడికి ఆర్థిక సాయం

గుడివాడ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల పని ప్రదేశంలో ప్రమాదావశాత్తు కింద పడి చేతికి గాయమైన కార్మికుడు సామంతుల శ్యామ్ లక్ష్మణరావుకు ది గుడివాడ ఇండస్ట్రియల్ అండ్ ఆటో మొబైల్ వర్కర్స్ యూనియన్ నాయకులు రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. బుధవారం స్థానిక రంగనాయకమ్మ వీధిలోని లక్ష్మణరావు ఇంటికి యూనియన్ నాయకులు వచ్చి ఆరోగ్య కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షుడు తమ్మిశెట్టి లక్ష్మణరావు, అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్ హమీద్, అబ్దుల్ ఖుద్దూస్, నాయకులు మొహిద్దీన్‌భాష, రెడ్డి నాగరాజు, కల్లకుంట నాగరాజు, మాదిరి శ్యామ్‌కుమార్, వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం చోరీ

గుడివాడ, జూన్ 18(ఆంధ్రజ్యోతి) : గత నెలలో జరిగిన మినీమహానాడుకు వచ్చిన పెంజెంద్రకు చెందిన గూడవల్లి రాజశేఖర్ ఏపీ 07డీఎఫ్ 2041 నంబర్ గల బైక్ చోరీకి గురైంది. బైక్ కోసం ఎంత వెతికి న దొరకలేదని ఆయన వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తునట్టు హెడ్ కానిస్టేబుల్ శంకర్ తెలిపారు.

విద్యుత్ అధికారుల చోద్యం

తోట్లవల్లూరు : దేవరపల్లిలో ఓ వ్యక్తి తన ఇంటివద్ద విద్యుత్ స్తంభాలతో పశువుల షెడ్డు నిర్మించాడని, దీనిపై చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పెదపారుపూడిలో టీడీపీ బలోపేతమే లక్ష్యం

● దేవినేని రత్నభూషణ్



నూతన గ్రామ కమిటీతో దేవినేని రత్నభూషణ్

పెదపారుపూడి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పెదపారుపూడి టీడీపీ బలోపేతానికి గ్రామ స్థాయి నుంచి కమిటీలను ఏర్పాటు చేయాలని కంకిపాడు సాగునీటి సంఘం డీసీ చైర్మన్, పెదపారుపూడి టీడీపీ మండల పరిశీలకుడు దేవినేని రత్న భూషణ్ పేర్కొన్నారు. మండలంలోని యలమర్రులో టీడీపీ సీనియర్ నేత సూరపనేని వెంకట సత్యనారాయణ గృహంలో మండల కార్యకర్తల సమావేశం టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు చిలకా ఆంజనేయులు, టీడీపీ నాయకులు దూళ్ల జమ్మిబాబు, ఉజ్జినేని అనిల్, జూపల్లి రాజేష్, వీరంకి శ్రీనివాస్, దాసు రమేష్ తదితరులు పాల్గొన్నారు.,

యోగాంధ్రను విజయవంతం చేయాలి

● పెదపారుపూడి ఎంపీడీవో విమాదేవి

పెదపారుపూడి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సహాయకులు ఈ నెల 21న జరగబోయే యోగాంధ్రను విజయవంతం చేయాలని పెదపారుపూడి ఎంపీడీవో విమాదేవి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సహాయకులతో సమావేశమై అమలులో ఉన్న ప్రభుత్వ కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగాంధ్రలో భాగంగా యోగా పట్ల ఆసక్తి కనబర్చిన పౌరులకు ఫేజ్-3లో శిక్షణలు కొనసాగుతున్నాయన్నారు. 21వ తేదీన మండలంలో నిర్దేశించిన రిజిస్టర్ కాబడిన అన్ని చోట్ల యోగా కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో విమాదేవి

నందివాడ : ఈ నెల 21న జరగబోయే యోగాంధ్రను విజయవంతం చేయాలని ఎంపీడీవో మల్లేశ్వరి ఓ ప్రకటనలో తెలిపారు.

గుడివాడ : స్థానిక మాంటిస్సోరి ఇంగ్లీషు మీడియం పాఠశాలలో తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీ గురువారం 'యోగాంధ్ర' కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు గుడివాడ విశిష్ట ధర్మాచార్య కావూరి శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు జిల్లాల కో-ఆర్డినేటర్ సి.వి.కె ప్రసాద్, ప్రముఖ యోగ గురువు డా.కొడాలి సోమసుందరరావులు పాల్గొంటారని కావూరి శ్రీధర్ తెలిపారు.

సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు

● ఏవో బోలెం అనంతలక్ష్మి



రామన్నపూడిలో ..

గుడివాడ రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతూ సేంద్రీయ వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని ఏవో బోలెం అనంతలక్ష్మీ తెలిపారు. బుధవారం రామన్నపూడి, తట్టివర్రు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సేంద్రీయ వ్యవసాయం నిర్వహించటం వల్ల ప్రజలకు ఆరోగ్యంతోపాటు భూమి గుల్లబారదని తెలిపారు. రైతులందరూ ఒక యూనిట్‌గా చేసుకుని సేంద్రీయ వ్యవసాయం నిర్వహించాలని కోరారు. తట్టివర్రు, రామన్నపూడి రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

కూచిపూడి: ఖరీఫ్‌లో రైతులు నారుమడులు పోసుకునే ముందు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేసుకోవాలని మొవ్వ సబ్‌డివిజన్ ఏడీఏ శ్యామల రైతులకు సూచించారు. కూచిపూడిలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించి వ్యవసాయాధికారులు రైతులకు పలు సూచనలు చేశారు. యంత్ర పరికరాలు, డ్రోన్ల వినియోగంపై అవగాహన కల్పించారు. అన్నదాత సుఖీభవ, ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఏవో సురేష్ బాబు నాయక్, కొండవీటి అమర బాలేశ్వరరావు, నాగరాజు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు : ప్రతి రైతూ యాజమాన్య పద్ధతులపై అవగాహన కలిగి ఉండాలని కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ బి.నవీన్ పేర్కొన్నారు. వరి నారుమడిలో యాజమాన్య పద్ధతులపై బుధవారం శేరికల్వపూడిలో వ్యవసాయాధికారులు రైతులకుసూచనలు చేశారు. మండల వ్యవసాయాధికారి సునీల్ పాల్గొన్నారు.

పమిడిముక్కల: రాయితీపై పశుగ్రాసం జొన్న విత్తనాలు రైతుసేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని తాడంకి గ్రామ పశువైద్య సహాయకుడు షకావత్ అలీ తెలిపారు. మంటాడ, కపిలేశ్వరపురంలో మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో బుధవారం, పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. వరినారుమడి యాజమాన్య పద్ధతులు మండల వ్యవసాయ అధికారి ఎస్ గణేశ్‌రెడ్డి రైతులకు వివరించారు. వరినారుమడులకు ఏవిధమైన తెగుళ్లు సోకకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియజేశారు. వ్యవసాయ సహాయకులు బి.శ్రీలత, జి.సురేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

పామర్రు : గ్రామాల్లో రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు అవలంబించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పొలంబడి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని జిల్లా వనరుల కేంద్రం డిప్యూటి డైరక్టర్ ఎ.జ్యోతిరమణి అన్నారు. కనుమూరు, కురుమద్దాలి గ్రామాల్లో బుధవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమాలపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మేలైన యాజమాన్య పద్ధతులతో అన్ని రకాల పంటలపై 14 వారాల పాటు గ్రామాల్లో రైతులకు ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పంటలపై రసాయన మందుల వినియోగం వల్ల జరిగే అనర్థాలతోపాటుగా, భూసారాన్ని కాపాడుకోవడానికి పచ్చిరొట్ట ఎరువు వల్ల కలిగే లాభాలను ఆమె వివరించారు. కృషీ విజ్ఞాన శాస్త్రవేత్త రేవతి, సాంకేతిక ఏవో పద్మజ, గ్రామ వ్యవసాయ సహాయకులు శ్రావణి, పావని, రైతులు పాల్గొన్నారు.



పామర్రులో..



కూచిపూడిలో..

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	104, 112, 123
చికెన్ విత్ స్కిన్	198
చికెన్ స్కిన్‌లెస్	208



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 530

అవనిగడ్డలో మెగా జాబ్‌మేళా రేపు

అవనిగడ్డ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : అవనిగడ్డ డిగ్రీ కళాశాల ఆవరణలో ఈనెల 20వ తేదీన మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు క్లింకారా ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్ గుడివాక లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో వివిధ కంపెనీల్లో మేనేజర్, రిటైల్ సేల్స్ ఆఫీసర్, డేటా ఎంట్రీ ఆపరేటర్, టెక్నీషియన్, కెమిస్ట్ తదితర ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమో, డిగ్రీ, బిటెక్ ఉత్తీర్ణులై 35 సంవత్సరాల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇంటర్వ్యూలు జరుగుతా యన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 90143 33335లో సంప్రదించాలని కోరారు.



చేవేండ్రలో వీర జవాన్ సాదరబోయిన నాగరాజు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు

వీర జవాన్ నాగరాజు విగ్రహావిష్కరణ

పెడన రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : దేశ రక్షణలో సైనికుడు సాదరబోయిన నాగరాజు అందించిన సేవలు స్ఫూర్తిదాయకమని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు అన్నారు. సైన్యంలో పనిచేస్తూ గత ఏడాది శ్రీనగర్‌లో మృతి చెందిన వీరజవాన్ సాదరబోయిన నాగరాజు విగ్రహాన్ని స్వగ్రామం చేవేండ్రలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ రావు ఆవిష్కరించారు. నాగరాజు కుటుంబం దేశరక్షణకు అంకితం కావడం అభినందనీయమన్నారు. జడ్పీటీసీ సభ్యుడు అర్జా నగేష్, శలపాటి ప్రసాద్, శీరం ప్రసాద్, అంకెం పమిడేశ్వరరావు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



డీఎంహెచ్‌వో శర్మిష్ట ఘంటసాల పీహెచ్‌సీ తనిఖీ

ఘంటసాల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ఘంటసాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్నిజిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.శర్మిష్ట బుధవారం తనిఖీ చేశారు. ఓపీ, రికార్డులను పరిశీలించారు. వైద్యసేవలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామ శివారులోని హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ నిర్మాణానికి స్థల సమస్య ఏర్పడిందని, బడ్జెట్ రిలీజ్ అయిన వెంటనే పనులు పూర్తి చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. పీహెచ్‌సీకి వచ్చిన డీఎం అండ్ హెచ్‌వోను వైద్య సిబ్బంది ఘనంగా సత్కరించారు. డాక్టర్ వేమూరి ప్రమోద్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ కుమార్, స్టాఫ్ నర్సు రాణి, ల్యాబ్ టెక్నీషియన్ దివ్య, ఫార్మసీ ఆఫీసర్ కృష్ణ, సూపర్‌వైజర్లు పూర్ణచంద్రరావు, శివకృష్ణ, ఎంపిహెచ్ఏ సిహెచ్.శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



పాపవినాశనంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

రైతులకు ఖరీఫ్ సాగుపై అవగాహన

ఘంటసాల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : పాపవినాశనం, గోగినేనిపాలెం గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి కె.పద్మజ రాణి, వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో కలిసి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ ఎస్.శ్యామల మాట్లాడుతూ రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించటం జరుగుతుందన్నారు. నారుమడిలో సూక్ష్మధాతు లోపాలు, నివారణ చర్యలను వివరించారు. జింక్ లోపానికి జింక్ సల్ఫేట్, ఇనుము ధాతు లోపానికి అన్నబేది, నిమ్మ ఉప్పు పిచికారి చేయాలన్నారు. ఏవో పద్మజ రాణి వ్యవసాయ శాఖ అందించే పచ్చిరొట్ట విత్తనాలు, వరి విత్తనాలు, వ్యవసాయ యాంత్రీకరణ వివరించారు. కుంపటి చిట్టిబాబు, మురాల సుబ్రహ్మణ్యం, సుంకర వీరయ్య చౌదరి, గోగినేనిపాలెం ఉపసర్పంచ్ గణపనేని వెంకటేశ్వరరావు, కుంపటి సుబ్బారావు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.



కొండరాళ్లు వేసి మార్జిన్‌ను పటిష్టం చేస్తున్న అధికారులు

రోడ్డు మార్జిన్ పటిష్టానికి చర్యలు

కోడూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : కోడూరు - అవనిగడ్డ ప్రధాన రహదారి నిర్మాణం పనులు దాదాపుగా పూర్తయ్యాయి. జయపురం - వి.కొత్తపాలెం గ్రామాల మధ్య ఆరు ప్రదేశాల్లో రహదారి మార్జిన్లు కుంగిపోయాయి. నిర్మాణ దశలోనే కుంగుతున్న రహదారి శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురించగా, స్పందించిన అధికారులు రెండు రోజుల నుంచి కుంగిన చోట కొండరాళ్లను వేసి రక్షణ చర్యలు చేపడుతున్నారు. కాలువను ఆనుకుని మీటర్ మేర లోపలి రాళ్లు అమర్చి పటిష్ఠపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్ అండ్ బి శాఖ డీఈ రమేష్‌బాబు తెలిపారు.



ప్రభాకర్‌జీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మండలి

ప్రభాకర్‌జీ సేవలు చిరస్మరణీయం

అవనిగడ్డ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : దివిసీమ ఉప్పెన సహాయక చర్యల్లో ప్రభాకర్‌జీ పాత్ర మరువలేనిదని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. గాంధీక్షేత్రంలో సర్వోదయ నాయకుడు, మహాత్మాగాంధీ అనుచరుడు ప్రభాకర్‌జీ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. దివిసీమ ఉప్పెన విషాద ఘటన సంభవించిన సమయంలో మృతుల సామూహిక అత్యంక్రియల నిర్వహణకు శవసేన స్థాపించి ప్రభాకర్‌జీ చేసిన సేవలు అనిర్వచనీయమన్నారు. మండలి వెంకట్రామ్, మత్తి శ్రీనివాసరావు, కూనపరెడ్డి చంద్రశేఖర్, కొల్లూరి వెంకటేశ్వరరావు, యాసం చిట్టిబాబు, బచ్చు రఘునాథ్, బండే కనకదుర్గ, బొప్పన భాను, రేపల్లె రవీంద్ర, సిద్ధినేని అశోక్ నాయుడు, బచ్చు శ్రీహరి, బండే రాఘవ, బచ్చు వెంకట్ నాథ్ ప్రసాద్, విశ్వనాథుని మురళీ మోహన్, గుడివాక శివరావు, మండలి శేషు, చందన నరసింహారావు, షేక్ మొగల్ మురాద్ బేగ్, విశ్వనాథపల్లి పాప తదితరులు పాల్గొన్నారు.



గుండేరు డ్రెయిన్‌ను పరిశీలించి అధికారులకు ఆదేశిలిస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ



కలెక్టర్, జేసీలను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పౌరసరఫరాల మేనేజర్ శివరామప్రసాద్

డ్రెయిన్ల పనులు త్వరగా పూర్తి చేయాలి

● కలెక్టర్ డీకే బాలాజీ

చల్లపల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : వర్షాలు మొదలై వ్యవసాయ పనులు ప్రారంభమైన నేపథ్యంలో డ్రెయిన్ల పనులు యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని కలెక్టర్ డికె.బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ బుధవారం నాగాయలంక వెళుతూ జాతీయ రహదారి వెంబడి మచిలీపట్నం, ఘంటసాల మండలాల్లోని డ్రెయిన్లు, ప్రధానంగా చల్లపల్లి మండలం లక్ష్మీపురం వద్ద గుండేరు డ్రెయిన్‌ను ఆయన పరిశీలించారు. వర్షాలు కురిసినపుడు ముంపుతో రైతులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ముందుగానే మురుగు కాల్వల్లోని గుర్రపుడెక్క, తూటుకాడ, కిక్కిస వంటి వంటి వాటిని తక్షణం తొలగించాలని సూచించారు. ప్రాధాన్యత కలిగిన సాగునీటి, మురుగుకాల్వల పనులు పూర్తిచేయాలన్నారు. తర్వాత మిగిలిన డ్రెయిన్ల పనులు చేయాలని సూచించారు డ్రైనేజీ ఈఈ కిరణ్ బాబు, ఏఈ చిరంజీవి, అధికారులు కలెక్టర్ వెంట ఉన్నారు.

కలెక్టర్, జేసీలతో సివిల్ సప్లయిస్ మేనేజర్ భేటీ

పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన టి. శివరామప్రసాద్ బుధవారం కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలి శర్మను మర్యాద పూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేశారు. పశ్చిమగోదావరి జిల్లా పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్‌గా పనిచేస్తూ ఆయన బదిలీపై కృష్ణాజిల్లాకు వచ్చారు.

టిప్పర్ ఢీకొని కార్మికుడి దుర్మరణం

మచిలీపట్నం టౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మంగినపూడి బీచ్ రోడ్డులో బైక్‌ను టిప్పర్ ఢీకొనడంతో వ్యవసాయ కార్మికుడు మృతి చెందాడు. భూముల్లోని మట్టిని తీసుకు వెళుతున్న టిప్పర్ ఢీకొనడంతో బైక్‌పై వెళ్తున్న కొఠారి కోటేశ్వరరావు దుర్మరణం చెందాడు.

కారు ఢీకొని ఇద్దరికి గాయాలు

మచిలీపట్నం టౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నంలో డీ మార్టు వద్ద బుధవారం రాత్రి 9-30 గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. కారు బైక్‌ను ఢీకొనడంతో ఇద్దరు గాయపడగా, స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పారు. పూర్తి వివరాలు అందాల్సి ఉంది.



సమావేశంలో మాట్లాడుతున్న గోపు సత్యనారాయణ

సంస్థాగత ఎన్నికలకు పరిశీలకులు వీరే

పెడన, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సంస్థాగత ఎన్నికల నిర్వహణకు పెడన నియోజకవర్గ పరిశీలకుడిగా తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ నియమితులయ్యారు. పెడన మండల పరిశీలకుడిగా మాచవరపు ఆదినారాయణ, పెడన అర్బన్ పరిశీలకురాలిగా తలశిల స్వర్ణలత, బంటుమిల్లి మండల పరిశీలకుడిగా కొల్లూరి వెంకటేశ్వరరావు, గూడూరు మండల పరిశీలకుడిగా ఐ. భానుప్రకాష్, కృత్తివెన్ను మండల పరిశీలకుడిగా శొంఠి ప్రసాద్ నియమితులయ్యారు. నియోజకవర్గ పరిశీలకుడిగా నియమితుడైన గోపు సత్యనారాయణ పట్టణంలోని నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షులు, పరిశీలకులతో సమావేశం నిర్వహించి పార్టీ సంస్థాగత ఎన్నికలు ఎలా నిర్వహించాలన్న విషయమై దిశా నిర్దేశం చేశారు. పెడన, పెడన అర్బన్, గూడూరు, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల పార్టీ అధ్యక్షులు శలపాటి ప్రసాద్, యక్కల శ్యామలయ్య, పోతన స్వామి, కూనపరెడ్డి వీరబాబు, వడుగు తులసీరావు, జడ్పీటీసీ సభ్యుడు అర్జా వెంకటనగేష్, డీసీ చైర్మన్ బొర్రా కాశీ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



చాట్రగడ్డ దళితవాడలో కొరమేను చేపల ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మండలి

ఘంటసాల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : డ్వాక్రా మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పేర్కొన్నారు. చిట్టూర్పు గ్రామపంచాయతీ శివారు చాట్రగడ్డ దళితవాడలో కొడాలి లక్ష్మి ఏర్పాటు చేసిన కొరమేను చేపల ఉత్పత్తి ప్లాంట్‌ను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రారంభించారు. ఎమ్మెల్యే మండలి మాట్లాడుతూ, మత్స్య ఉత్పత్తుల్లో రాష్ట్రం మొదటి స్థానంలో ఉందన్నారు. గ్రామీణ ప్రాంత రైతులు, ప్రత్యేకంగా డ్వాక్రా మహిళలు కొరమేను చేపల సాగు ద్వారా ఆర్థిక పురోభివృద్ధి సాధిం చాలన్నారు. రాంకీ ఫౌండేషన్ ఎంవి..రామిరెడ్డి మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా మొవ్వ మండలం చినముత్తేవిలో చిట్టూరి కస్తూరిబాయ్, ఘంటసాల మండలం చిట్టూర్పులో కొడాలి వెంకటలక్ష్మీలకు కొరమేను ఉత్పత్తి ప్లాంట్ల ఏర్పాటుకు రూ.4,41,000ల చొప్పున ఆర్థిక సహకారం అందించినట్లు తెలిపారు. రుణాలను డ్వాక్రా మహిళలు వినియోగించుకుని ఆర్థిక పురోభివృద్ధి సాధించాలన్నారు. చిట్టూర్పులో పట్టాభి మెమోరియల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుట్టగొడుగులా ఉత్పత్తి శిక్షణా కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కొడాలిలో మార్కెట్ యార్డులో నూతన పాలకవర్గ సాధారణ సమావేశం జరుగగా, సమావేశానికి అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ హాజరయ్యారు. చైర్మన్ తోట కన కదుర్గ, ఉపాధ్యక్షులు అత్తులూరి గోపిచంద్, కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యే మండలిని ఘనం గా సత్కరించారు. టీడీపీ నేతలు తుమ్మల చౌదరి బాబు, పరుచూరి సుభాష్ చంద్రబోస్, గొర్రెపాటి వెంకట రామకృష్ణ, గుత్తికొండ వరప్రసాద్, దిరిశం వెంకట్రావు, పాటిబండ్ల నరేష్, సర్పంచ్ గూడపాటి వెంకటేశ్వరరావు, నీటి సంఘం అధ్యక్షులు దాసరి సతీష్, జనసేన నాయకులు కోన రాజశేఖర్, సుగ్గన పవన్ కుమార్, ఎంపిటిసి సభ్యులు తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా) పాల్గొన్నారు.



సముద్రపు ఉప్పు నీరు రాకుండా అవుట్‌ఫాల్ స్లూయిస్ గేట్ల కింద రాళ్లు వేస్తున్న రైతులు

రైతులకు తప్పని అవుట్ ఫాల్ స్లూయిస్ కష్టాలు

కోడూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : కోడూరు అవుట్ ఫాల్ స్లూయిస్‌కు గేట్లు బిగించినా రైతులకు తిప్పలు తప్పటం లేదు. అవుట్ ఫాల్ స్లూయిస్ వద్ద నీటి ప్రవాహానికి అడ్డం వేయకుండా,గుంతలు పూడ్చకుండా కాంట్రాక్టర్ తాత్కాలికంగా గేట్లు బిగించటంతో ఉప్పునీటి ప్రవాహం ఎగువకు యధావిధిగానే వస్తోంది. దీని కారణంగా వందలాది ఎకరాలలో ఉప్పు నీరు చేరి సాగు భూమి బీడుగా మారిందన్నారు. అవుట్ ఫాల్ స్లూయిస్ గేట్ల వద్ద బేస్‌మెంట్ కాంక్రీట్ పనులు చేస్తే ఉప్పు నీరు ఎగువకు రాకుండా ఆగుతాయని ఇరిగేషన్ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఉపయోగం లేదని రైతులు మాలెంపాటి రాంబాబు, బుచ్చి రాంబాబు వాపోతున్నారు. అవుట్ ఫాల్ స్లూయిస్ గేట్ల వద్ద బుధవారం రైతులే స్వయంగా బండరాళ్ళ, కంకర్ మూటలు వేసి గేట్ల కింద ఉన్న గుంతలను పూడ్చి నీటిని ఆప్రే పయత్నం చేశారు. ఇరిగేషన్ అధికారులు స్పందించి అవుట్ ఫాల్ స్లూయిస్‌కు రెండు పక్కల ఇసుక మూటలు వేసి మధ్యలో ఉన్న నీటిని తొలగించి గేట్ల కింద కాంక్రీట్ వేసి ఉప్పునీరు ఎగువకు రాకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

మోపిదేవి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ రోజు క్రమం తప్పకుండా యోగా చేయటం ద్వారా మానసిక ప్రశాంతత, సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఆరోగ్య భారతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గుడిసేవ విష్ణు ప్రసాద్ అన్నారు. మోపిదేవిలోని బీసీ మత్స్యకారుల ఆశ్రమ పాఠశాలలో ఆరోగ్యభారతి ఆధ్వర్యంలో యోగా శిక్షణ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఉదయం, సాయంత్రం సమయాల్లో విధిగా యోగా చేసినట్లైతే సంపూర్ణ ఆరోగ్యం, మానసిక ప్రశాంతత లభిస్తాయన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు వంగర శేషగిరిరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.ఎస్.బి.గోపాల్, వ్యాయామోపాధ్యాయులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మోపిదేవిలో విస్తృత ఏర్పాట్లు

ప్రపంచ యోగా దినోత్సం సందర్భంగా 19వ తేదీన మోపిదేవిలో యోగా కార్యక్రమానికి విస్తృత ఏర్పాట్లు చేశారు. పాఠశాల క్రీడామైదానంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ప్రతిమను ప్రత్యేక ఆకర్షణగా ఏర్పాటు చేయనున్నట్లు తహసీల్దార్ శ్రీవిద్య, ఎంపీడీవో స్వర్ణభారతి తెలిపారు. ఏకకాలంలో 1000 మంది యోగా నిర్వహించేందుకు అనువుగా క్రీడా ప్రాంగణంలో ఏర్పాట్లు చేశామన్నారు. మాజీ సర్పంచ్ రావి నాగేశ్వరరావు, మండల పరిషత్ పర్యవేక్షకులు పాండురంగారావు, ఆర్ఐ విశ్వనాథం, పంచాయతీ కార్యదర్శి రామకోటేశ్వరరావు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గోపాల్, రమణ, జయంతి, పిడి మారుతి తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

21న అన్ని గ్రామాల్లో..

పెడన రూరల్ : జూన్ 21 ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని సచివాలయల్లో ఉదయం 7గంటలకు ప్రజలతో యోగా చేయించాలని ఎంపీడీవో ఎ.అరుణకుమారి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఈవోఆర్డీ యం నాగిరెడ్డితో కలిసి పంచాయతీ కార్యదర్శులతో బుధవారం సమావేశం నిర్వహించారు. యోగాడే రోజున గ్రామాల్లో గుర్తించి ప్రదేశాల్లో ప్రజలతో యోగాభ్యాసం చేయించాలని యోగా ప్రయోజనాలను వివరించాలన్నారు.

వైభవంగా సత్యసాయి ప్రేమ రథయాత్ర

మచిలీపట్నం టౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : సత్యసాయి శత వసంతాల వేడుకలో భాగంగా సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం సత్యసాయి ప్రేమ రథయాత్ర జరిగింది. చిలకలపూడి పాండురంగ స్వామి దేవాలయం నుంచి బుట్టాయిపేట, రామానాయుడుపేట, కోనేరుసెంటర్, రాజాసెంటర్ మీదుగా సత్యసాయి మందిరానికి చేరుకుంది. రాష్ట్ర సత్యసాయి సేవా సమాజం ప్రతినిధి కొమరగిరి చంద్రశేఖర్, పోతుకూచి ఆంజనేయకుమార్ తదితరులు పాల్గొన్నారు.పెడన : భగవాన్ సత్యసాయి శత జయంతి వేడుకల్లో భాగంగా సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో బుధవారం సత్యసాయి ప్రేమరథయాత్ర నిర్వహించారు. తోటమూల ఆంజనేయ స్వామి ఆలయం వద్ద నుంచి బస్టాండ్ సెంటర్ సీతారామాంజనేయ స్వామి ఆలయం వరకు రథయాత్ర సాగింది.

కన్నా కుటుంబానికి విక్కుర్తి పరామర్శ

నాగాయలంక, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మాతృవియోగానికి గురైన మాజీ జడ్పీటీసీ సభ్యుడు కన్నా నాగరాజు, కన్నా రామ్మోహనరావు, కన్నా వెంకటేశ్వరరావు (చిన్నా), సర్పంచ్ సుధా కీర్తనలను ఎదురుమొండిలో పారిశ్రామిక వేత్త విక్కుర్తి శ్రీనివాసరావు పరామర్శించారు. విక్కుర్తి రాంబాబు, రామకృష్ణ, చంద్ర, రేపల్లె మునయ్య, బర్మా బుజ్జి, కంచర్ల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్టీలకు బియ్యం, కూరగాయల వితరణ

మండల టీడీపీ అధ్యక్షులు మెండు లక్ష్మణ రావు పుట్టిన రోజు సందర్భంగా చోడవరం ఎస్టీలకు బియ్యం, కూరగాయలను పంపిణీ చేశారు. రాధ, రాం ప్రసాద్, నాగరాజు, ముప్పరాజు సందీప్, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.